అనుదినం జనహితం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 28 జులై 2023

జనరల్ డిగ్రీ కళాశాల మంజూరు : ఎమ్మెల్యే బాపురావు

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలోని ఇచ్చోడ మండలం కేంద్రంలో జనరల్ డిగ్రీ కళాశాల మంజూరు అయినట్లు గురువారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తెలిపారు. బోథ్ పట్టణానికి ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల మంజూరైనా స్థలం సమస్యగా ఉండడంతో ఆదిలాబాద్ పట్టణంలో నడుస్తోందన్నారు. కళాశాల నిర్మాణానికి స్థలం కేటాయింపు, ఇచ్చోడ మండల కేంద్రంలో జనరల్ డిగ్రీ కళాశాల మంజూరు జీవో కాపీని ఎడ్యుకేషన్ సెక్రటరీ వాకటి కరుణ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. కళాశాల మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, మంత్రి హరీష్‌రావు, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, జిల్లా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని మున్యాల, దేవినిగూడెం గ్రామాలలో గురువారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతాలైన దేవునిగూడెం, బూత్కూర్, రాంపూర్, మున్యాల, గోడిసిర్యాల, చెన్నూర్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం అందిస్తూ పరివాహక ప్రాంతాలలోని లోతట్టులో ఉండే ప్రజలను ఇండ్లు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలైన దగ్గరలోని పాఠశాలలకు, గ్రామపంచాయతీలకు తరలించాలని సూచించారు. వారికి నీరు, భోజన సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్క అధికారి గ్రామాల్లోనే ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట డిఆర్ఓ లోకేష్, తహసిల్దార్ లక్ష్మి, ఆర్ఐ గంగన్న, సర్పంచులు, జెడ్పీటిసి శారద శ్రీనివాస్ ఉన్నారు.

ఆర్టీసీలో కార్మిక సంఘాలను కొనసాగించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీలో కార్మిక సంఘాలను కొనసాగించాలని, గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే జరపాలని ప్రజా సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సేవ్ ఆర్టీసీ పేరుతో పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మొండివైఖరిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ఒంటెద్దు పోకడలను అవలంభిస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా రవాణ వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే రెండు వేతన సవరణలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్, కండక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను కాపాడాలన్నారు. కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సాజిద్‌ఖాన్, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు రమేష్, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్, సిపిఐ-ఎంఎల్ ప్రజాపంథా నాయకులు జగన్ సింగ్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో ముంపు సమస్య పాలకుల నిర్లక్షమే

- మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్‌లో ముంపు ప్రాంతాల సమస్యకు పాలకుల నిర్లక్ష్యమే కారణమని బిజెపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నీటమునిగిన సిద్దాపూర్, జీఎన్ఆర్ కాలనీ, మంచిర్యాల చౌరస్తా ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాలకుల నిర్లక్ష్యం, కబ్జాలు, అనాలోచిత విధానాల వల్లే నిర్మల్ పట్టణంలో ఈ సమస్యలు వస్తున్నాయని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని పెద్దనపల్లి శివారులో సిద్ధి వినాయక రైస్ మిల్ సమీపంలో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. స్టేషన్ పెద్దనపల్లికి చెందిన తాళ్ల రామ్మూర్తికి చెందిన సుమారు రూ.80,000 విలువ గల గేదె స్థానికంగా ఉన్న పొలంలో మేతకు వెళ్లింది. అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.

పరివాహకం..భయానకం..!

- కడెం ప్రాజెక్టును ముంచెత్తిన వరద ప్రవాహం
- సురక్షిత ప్రాంతాలకు పరిసర గ్రామాల ప్రజలు
- భారీ వర్షానికి ఉప్పొంగిన వాగులు, వంకలు
- పల్లెలు..పంట పొలాలను చుట్టుముట్టిన వరద
- తెగిపోయిన కల్వర్టులు..ధ్వంసమైన రహదారులు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విలయం సృష్టించిన వర్షం
- పరిసర గ్రామాలను అప్రమత్తం చేసిన అధికారులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాత్రి కురిసిన భారీ వర్షం భయానక పరిస్థితులను సృష్టించింది. నదులు, వాగుల పరివాహక ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏ క్షణాన వరద ముంచెత్తుతోందోనని ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడం.. ఇప్పటికే ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండిపోవడం.. నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీనికి తోడు గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నదులు, వాగులు, వంకలు మరింత ఉగ్రరూపం దాల్చాయి. వాటి పరివాహక ప్రాంతాల్లోని పల్లెలు, పంట పొలాలను చుట్టుముట్టాయి. రోడ్లు, కల్వర్టులు ధ్వసమయ్యాయి. వందలాది పల్లెలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధానంగా కడెం ప్రాజెక్టు వద్ద తలపించిన పరిస్థితి ఉమ్మడి జిల్లావాసులను కలవర పెట్టింది. ప్రాజెక్టు పై నుంచి వరద ప్రవహించడంతో ఏ క్షణంలో ఏం జరుగుతోందోనని సర్వత్రా ఆందోళన చెందారు. ఇన్‌ఫ్లో అధికంగా ఉండటం.. అవుట్ ఫ్లో తక్కువగా ఉండటంతో ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారవర్గాల్లోనూ ఆందోళన వ్యక్తమైంది. సాయంత్రం వరకు ఇన్‌ఫ్లో తగ్గడంతో అందరూ కాస్త ఊపిరి పీల్చుకున్నారు. దీనికి తోడు ఉమ్మడి జిల్లాలో అనేక ప్రాంతాలు జల దిగ్బంధనంలో చిక్కుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.



తలమడుగు : ఖోడద్ వద్ద వంతెన పైనుండి ప్రవహిస్తున్న వరద నీరు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, కడెం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తాయి. అధిక వర్షాల కారణంగా ఇప్పటికే జిల్లావాసులు వణికిపోతుండగా.. తాజాగా కురుస్తున్న భారీ వర్షాలు మరింత అతలాకుతలం చేశాయి. గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగా నదలుతో పాటు గ్రామాల సమీపంలోని వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చడం.. గ్రామాల్లోకి వరద నీరు చొచ్చుకురావడంతో అనేక పల్లెలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వాటి పరివాహక ప్రాంతాల్లోని పంటలు నీటిలో మునిగిపోయాయి. అనేక చోట్ల రోడ్లు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. తలమడుగు మండలం కోడద్- హస్నాపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించడంతో అటువైపు గ్రామాలతో పాటు మహారాష్ట్ర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇదే మండలంలోని తలమడుగు, సుంకిడి తదితర గ్రామాల వద్ద కల్వర్టులు ధ్వంసమయ్యాయి. బరంపూర్ సమీపంలోని వాగుపై ఉన్న కల్వర్టు సగం తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బోథ్ మండలం ధనోర(బి) గ్రామ సమీపంలోని వాగు ఉప్పొంగడంతో ఆ గ్రామం జలదిగ్బంధనంలో చిక్కుక్కుంది. ఆదిలాబాద్ గ్రామీణ మండలం బూర్నూర్ గ్రామంలో వర్షం తాకిడికి ఇల్లు కూలిపోయింది. ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ త్రివేణి సంగమం చెరువు మత్తడి పొంగి ప్రవహించడంతో ఆదిలాబాద్-ఉట్నూర్ ప్రధాన రహదారి తెగిపోయింది. భైంసా మండలం సిరాల ప్రాజెక్టు గండిపడటంతో కట్టపై నుంచి నీరు ప్రవహిస్తోంది. సుమారు పది గ్రామాల ప్రజలు భయాందోళనతో కొండపైకి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. పలు వాగులు ఉప్పొంగడంతో ఇలేగాం, దహెగాం తదితర గ్రామాలను వరద చుట్టుముట్టింది. దహెగాం మండలం పెసరికుంట గ్రామంలో వరద ప్రవాహాన్ని పరిశీలించేందుకు వెళ్లిన తహసీల్దార్ రాథోడ్ ప్రహ్లద్ అదే గ్రామంలో చిక్కుకున్నారు. పెద్దవాగు ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తుండటంతో సమీప పరివాహక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దండేపల్లి మండలంలో ముంపు ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

భయపెట్టిన కడెం ప్రాజెక్టు..!

ఉమ్మడి జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో పరిసర గ్రామాల్లో భయానక పరిస్థితులు తలపించాయి. రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద ప్రవాహం తీవ్రరూపం దాల్చడంతో ప్రాజెక్టు పైనుంచి నీరు ప్రవహించింది. ఈ సమయంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. కిందటేడాది వరద ముంపు కారణంగా పరివాహక గ్రామాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది.ఆస్తులు, పంటలను కోల్పోవాల్సి వచ్చింది. మునుపటి పరిస్థితి తాజాగా పునరావృతమయ్యే పరిస్థితి కనిపించడంతో ప్రాజెక్టు పరివాహకంలో ఉన్న 12 గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. అధికారులు వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాటుచేశారు. ప్రాజెక్టుకు ఉన్న 18గేట్లతో 14 తెరుచుకోవడం.. మరో నాలుగు గేట్లు మొరాయించడంతో వరద తాకిడి తట్టుకోలేకపోయాయి. ప్రాజెక్టు పై నుంచి ఉప్పొంగి ప్రవహించింది. ప్రాజెక్టు దిగువన పాండ్వాపూర్ బ్రిడ్జి అంచుల వరకు నీరు ప్రవహించడంతో నిర్మల్- మంచిర్యాల రహదారిని మూసివేశారు. వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. సాయంత్ర వరకు ప్రాజెక్టులోకి వరద నీటి ప్రవాహం తగ్గినా.. వర్షం ఇంకా కురుస్తుండటంతో రాత్రి వరకు వరద ఉధృతి పెరిగే అవకాశాలు లేకపోలేదని స్థానికులు చెబుతున్నారు. మొరాయించిన నాలుగు గేట్లతో రెండింటిని జేసీబీ సాయంతో తెరిచినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. వర్షం ఇలాగే కురిస్తే మాత్రం ఈ ప్రాజెక్టుకు వరద తాకిడి మరింత అధికమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు పరిసర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో వాటి వద్ద పునరావాస శిబిరాలు ఏర్పాటుచేస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో టోల్ ఫ్రీం నెంబర్లకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.



కుభీర్ : వాగులో చిక్కుకున్న వ్యక్తిని రక్షించి తీసుకొస్తున్న స్థానికులు



కడెం : కడెం ప్రాజెక్టు నుండి భారీ వరద ప్రవాహం



తలమడుగు : వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న నాయకులు

భారీ వర్షానికి స్తంభించిన జనజీవనం

- వరద భయం గుప్పిట్లో గోదావరి తీర గ్రామాల ప్రజలు
- నీట మునిగిన పత్తి పంట



నవతెలంగాణ-దండేపల్లి

ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలో జనజీవనం స్తంభించింది. వివిధ గ్రామాల్లోని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. గూడెం గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ఇండల్లోకి వరద నీరు చేరి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో వరద నీరును గోదారికి వదిలారు. దీంతో అధికారులు గోదావరి నది తీర ప్రాంతాలైన గుడిరేవు, ద్వారక గ్రామాలలోని నది తీరా ప్రాంతంలో గల గ్రామస్తులను అప్రమతం చేస్తూ వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వెలగనూరు, నంబల, గూడెం గ్రామాలలోని పత్తి పంట పూర్తిగా నీట మునిగింది. కడెం ప్రాజెక్టు ప్రమాదం స్థాయిలో ఉండడంతో మండలంలోని గుడిరేవు, లక్ష్మీకాంతపూర్, ద్వారక గోదావరి తీరాలను తహసీల్దార్ హనుమంతరావు, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఎస్సై ప్రసాద్ సందర్శించి వరద తీరును సమీక్షించారు. గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమతం చేస్తూ ముంపు గ్రామ ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టారు. మాదాపూర్, నర్సాపూర్ గ్రామాల మధ్యలో లెవెల్ వంతెనపై వరద నీరు ప్రవహించడంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం సాయంత్రం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు 131.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

బజార్‌హత్నూర్ : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో బుధవారం నుండి కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమై పంట పొలాలు తీవ్ర నష్టానికి గురయ్యాయి. పలు గ్రామాలకు వెళ్లే రోడ్డులు నీటి ప్రవాహానికి కోతకు గురైంది. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల జలదిగ్బంధమై విద్యార్థులు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా మండల కేంద్రానికి వచ్చే 11కెవి విద్యుత్ స్తంభాలు నీట మునిగి పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

సిరికొండ : మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. బుదవారం అర్ధ రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాలలో కురిసిన భారీ వర్షాల వల్ల వాగులు వంకలు పొంగిపొర్లి ప్రవహించాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. రాకపోకలకు తీవ్ర ఆటంకం నెలకొంది. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. పంట పొలాల్లో నీరు చేరి పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. మండలంలో 326.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోనే అత్యధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

నార్నూర్ : కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కావల రమేష్ సూచించారు. గురువారం మండలంలోని మలంగి గ్రామపంచాయతీ పరిధిలోని బారిక్‌రావ్ గూడకు వెళ్లే వాగును పరిశీలించారు. భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో ఎవరు వాగు దాటే ప్రయతం చేయవద్దని సూచించారు. అత్యవసర పని తప్ప బయటికి రావద్దన్నారు. ఆయన వెంట నార్నూర్, గాదిగూడ ఏపిఓ నితిన్, సురేందర్ ఉన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకుల పర్యటన

నేరడిగొండ: మండలంలోని వరద ప్రభావిత కుప్టి, కుమారి, బోరిగాం గ్రామాలలో గురువారం నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు అనిల్ జాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమంతగా ఉండాలన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. పంట పొలాలను పరిశీలించారు.

వర్షం ఆగింది..వరద పోటెత్తుతోంది..!

- అడ, వట్టి వాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత
- పొంగిన వాగులు, నిలిచిన రాకపోకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గురువారం వర్షం కొంత ఆగినప్పటికీ బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జిల్లాలో వరదలు పోటెత్తాయి. కొన్నిచోట్ల లోతట్టు ప్రాంతాలు నీట మునగగా పలు ప్రాజెక్టులు గేట్లు ఎత్తారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. అడ, వట్టి వాగు ప్రాజెక్టు గేట్లను ఎత్తి అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

అడ, వట్టివాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

అడ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు. ఉదయం పూట 8 గేట్లు ఎత్తి 76856 క్యూసెక్కుల నీటిని కిందికి వదిలిన అధికారులు సాయంత్రం వరకు 3,4,5,6,7 నెంబరు గల 5గేట్లను 3మీటర్లు ఎత్తి 29990 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి మట్టం 243 మీటర్లు కాగా సాయంత్రం వరకు 237 మీటర్లకు చేరుకుంది. దీంతో 5 గేట్లను ఎత్తి 29990 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.

వట్టి వాగు నీటి విడుదల

మండలంలోని వట్టి వాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు. ఉదయం పూట 4 గేట్లు ఎత్తి 9412 క్యూసెక్కుల నీటిని వదిలిన అధికారులు సాయంత్రం వరకు రెండు గేట్ల ద్వారా 4446 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 239.500 మీటర్లు కాగా 237.550 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 200 క్యూసెక్కులు ఉండగా నీటి ప్రవాహం ఉండటంతో 2గేట్లు 1.5 మీటర్లు ఎత్తి 4446 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

జిల్లాలో బుధవారం సాయంత్రం కుంభవృష్టి కురియగా అధికారుల లెక్కల ప్రకారం బుధవారం ఉదయం నుండి గురువారం ఉదయం వరకు జిల్లాలో సగటు 98.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.



అడ ప్రాజెక్టు నుండి ఉరకలెత్తుతున్న వరద నీరు

జైనూర్‌లో 138.2, సిర్పూర్(యు)లో 200.6, లింగాపూర్‌లో 137.6, తిర్యానిలో 123.4, రెబ్బెనలో 72.4, ఆసిఫాబాద్‌లో 85, కెరమెరిలో 82.4, వాంకిడిలో 51.6, కాగజ్‌నగర్‌లో 46.4, సిర్పూర్(టి)లో 47.8, కౌటాలలో 45.4, చింతలమానేపల్లిలో 27.8, బెజ్జూర్‌లో 105.6, పెంచికల్‌పేటలో 150.4, దహెగాంలో 164.2 మి.మీల వర్షం కురిసింది.

చింతలపాటు వాగును పరిశీలించిన కలెక్టర్

కౌటాల : నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గురువారం కలెక్టర్ హేమంత్ సహదేవరావు బొర్కుడె చింతలపాటి వాగును పరిశీలించారు. అధిక వర్షాల వల్ల వంతెన పైనుండి వరద ఉధృతి పెరిగినట్టయితే రాకపోకలను నిలిపివేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు.

స్తంభించిన రాకపోకలు

తాండూర్ : భారీ వర్షాలకు మండలంలోని రేచిని రైల్వే స్టేషన్ తాండూర్ మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. రైల్వే స్టేషన్ వద్ద గల రోడ్డు డ్యామ్ మీదుగా నీటి ప్రవాహం ఉధృతం కావడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. రైలు ప్రయాణం చేసే ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాండూర్, తాండూర్ ఐబిల మధ్య గల రెండు రైల్వే అండర్ బ్రిడ్జిల్లో నీరు నిలవడంతో మండల కేంద్రానికి రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో వ్యాపారస్తులు, ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాండూర్ అండర్ బ్రిడ్జి వద్ద రైల్వే అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

వర్షాల పరిస్థితులను పరిశీలించిన ఏరియా జీఎం

మందమర్రి : మందమర్రి పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కేకే-5, ఫిల్టర్ బెడ్, మొదటి, రెండవ, మూడవ జోన్ల క్వార్టర్లను, కాలనీలలోని మురికి కాలువల పరిస్థితిలను గురువారం ఏరియా జీఎం జి మోహన్‌రెడ్డి సివిల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని తగు సూచనలు చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సివిల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం సివిల్ శ్రీనివాసులు, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సివిల్ ఎస్ఈ జయప్రకాష్, యూనియన్ నాయకులు, సివిల్ సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బీటీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని పలు ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారడం, స్థానికుల నుండి తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతుండడంతో అధికారులు స్పందించారు. స్థానిక రాజీవ్‌చౌక్ నుండి పొట్టి శ్రీరాములు చౌక్ వరకు బీటీ రోడ్డు పనులను గురువారం మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. వాస్తవానికి ఈ పనులను ఆరు నెలల ముందే చేపట్టాల్సి ఉండగా తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఎన్టీఆర్ చౌక్ నుండి పొట్టి శ్రీరాములు చౌరస్తా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. కోటి మంజూరయ్యాయి. ఈ పనులను జనవరి 12న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించారు. ఇక రోడ్డు సమస్యలు తీరినట్లేనని పట్టణవాసులు భావించారు. కాని నెల గడిచినా అప్పట్లో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. స్థానికుల నుండి నిరసనలు రావడంతో ఎన్టీఆర్ చౌక్ నుండి రాజీవ్‌చౌక్ వరకు మాత్రమే ఫిబ్రవరి 23న పనులు ప్రారంభించి పూర్తి చేశారు. కాని రాజీవ్‌చౌక్ నుండి పొట్టి శ్రీరాములు చౌక్ వరకు పనులు చేపట్టలేదు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడం, బీజేపీ నాయకులు ఆ గుంతలలో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేయడం, రోడ్ల దుస్థితిపై సోషల్ మీడియాలో వ్యతిరేకంగా ప్రచారం అవుతుండడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. గురువారం రాజీవ్‌చౌక్ నుండి పొట్టి శ్రీరాములు చౌక్ వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు.



బీజేపీ పోరాట ఫలితమే రోడ్డు నిర్మాణం

రోడ్డు నిర్మాణం బీజేపీ పోరాట ఫలితమేనని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు గోలెం వెంకటేష్ అన్నారు. పట్టణ రోడ్లు గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా స్థానిక ఎమ్మెల్యేకు, పాలకవర్గానికి చీమకుట్టినట్లయినా లేదని అన్నారు. తాము వరి నాట్లు వేసి నిరసన తెలుపడంతోనే దిగి వచ్చిన అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టారని అన్నారు.

బెజ్జూర్ జీపీలో విచారణ చేపట్టాలి

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్

బెజ్జూర్ : బెజ్జూర్ గ్రామ పంచాయతీలో జరిగిన అక్రమాలపై వెంటనే ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. రూ.5.80లక్షల నిధులు రెండు సార్లు పాలకవర్గం విత్‌డ్రా చేసిందని, అయినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఎస్ఎఫ్‌సీ నుండి రూ.5.80లక్షలు, సెంట్రల్ ఫండ్ నుండి రూ.5.80లక్షలను విత్‌డ్రా చేసిన వారిపై చర్యలు లేవన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అండదండలతో గ్రామ పంచాయతీలో అక్రమాలు జరుగుతున్నా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. బెజ్జూర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి అటకెక్కిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



తొమ్మిది మంది పాలకవర్గ సభ్యులు ఈ నిధులను కాజేశారని, దానికి సంబంధించిన ఆధారాలను పత్రికాముఖంగా చూపించారు. అనంతరం గ్రామాల్లో నెలకొన్న అపరిశుభ్రతపై అధికారులను ప్రశ్నించారు. గ్రామంలో రోడ్లు, మురికికాలువలు లేక ఇబ్బందులు పడుతున్నారని, జ్వరాలు వస్తే పట్టించుకొనే నాథుడే లేడన్నారు. ఆయన వెంట బీఎస్పీ నాయకుడు సిడాం గణపతి, అర్షద్‌హుస్సేన్, రాంప్రసాద్, డోంగ్రి చిత్రు, సల్మాన్, రవీందర్, సోయం చిన్నయ్య, ఆత్రం సాయి, మహిళా నాయకురాలు అమృత ఉన్నారు.

తహసీల్దార్ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ-బోథ్



మండలంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 48.25 లక్షల నిధులు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకి చేరడంతో మండల ప్రజల ఇబ్బందుల దృష్ట్యా నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్టు తెలిపారు. రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ చేతుల మీదుగా అధికారిక మంజూరు పత్రాన్ని అందించినట్లు తెలిపారు. అలాగే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు, జిల్లా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట నాయకులు కరాడ్ బ్రహ్మానంద్, తిత్రే నారాయణ సింగ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి సాగర్ అన్నారు. గురువారం ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేయగా, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి సంబంధించిన మాత్రలు అందజేశారు. డాక్టర్ సాగర్ మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడు లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. నీరు నిల్వ ఉండకుండా తొలగించాలని తెలిపారు. తల నొప్పి, వాంతులు, విరేచనాలు ఎలాంటి లక్షణాలు ఉన్న నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కైలాస్, వైద్య సిబ్బంది పద్మా, సుధా, భీంభాయి పాల్గొన్నారు.

దంచికొడుతున్న వానలు

నవతెలంగాణ-ఉట్నూర్

భారీ వర్షాలు కురుస్తున్నా నేపథ్యంలో ఉట్నూర్ మండలంలో పలు గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. గత బుధవారం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. దీనితో మండలంలోని పలు వాగులు, వంకలు పొర్లుతున్నాయి. మండలంలోని పులిమడుగు, లక్కెటిపేట, నాగపూర్, బాబాపూర్, వంకతుమ్మ, రాజులమడుగు, నర్సాపూర్(జె), దంతన్‌పల్లి గ్రామాల సమీపంలో ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అధికార యంత్రాంగం అప్రమత్తమై వర్షంలో ప్రయాణాలు చేయవద్దని, వాగులు దాటే ప్రయత్నాలు చేయద్దని సూచించారు. అత్యవసర సమయంలో అధికారులకు సమాచారం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని లక్కెటిపేట గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగు ఉధృతి కారణంగా రోడ్డును డీఎల్పీఓ భిక్షపతిగౌడ్, అధికారులు, నాయకులు పరిశీలించారు. ప్రజలు, వాహనదారులు రాకపోకల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో అంబేద్కర్ ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా పలు దుకాణాలలో వరద నీరు చేరింది. మండలంలోని మత్తడిగూడ ప్రాజెక్టు వైపు ప్రజలు ఎవరు రావద్దని, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ జాధవ్ శ్రీరాం, ఎంపీపీ పంద్రా జైవంత్ రావు సందర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. వారి వెంట ఇరిగేషన్ డీఈ రాథోడ్ వినోద్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, మత్తడిగూడ పటేల్ మోతీరాం ఉన్నారు.

నార్నూర్ : ఉమ్మడి మండలంలో గురువారం భారీ కుండపోత వర్షం కురిసింది. వారం రోజులుగా భారీగా కురుస్తున్న వర్షంతో గ్రామానికి పక్కన ఉన్న వాగులు, వంకలు, చెరువులు నిండాయి. దీనితో చాలా గ్రామాల ప్రజలు రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. కురుస్తున్న భారీ వర్షానికి కునికాసా, కొత్తపెల్లి, చిత్తగూడ, డోంగర్‌గావ్, అర్జుని, మారుగూడ, దాబా(బి), దాబా(కే), లోకారి(కె), ఖడ్కి, ధర్మ గూడ, కుండి షేక్‌గూడతో పాటు తదితర గ్రామాల వాగులకు నీటి ప్రవాహం రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల వ్యవసాయ పొలంలో పంటలు నీట మునిగిపోయాయి. దీనితో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో రెండు రోజులుగా భారీ వర్షం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగు దాటే ప్రయత్నం చేయవద్దని పోలీసు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

తాంసి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు కుండపోతగా కురియడంతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. బుధవారం రాత్రి నుంచి ఉదయం వరకు కుండపోత వర్షాలతో తాంసి, భీంపూర్ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఎటువెళ్లలేక, ఇండ్లకే పరిమితమయ్యారు. అంతర్‌రాష్ట్ర రహదారి మీదుగా వెళ్లే హస్నాపూర్ వాగు భారీ వర్షం కారణంగా రాత్రి నుంచి రాకపోకలు స్తంభించాయి. అటు భీంపూర్, కరంజి, అంతర్‌గాం, అర్లి(టి), పిప్పల్‌కోటి, గ్రామంలో ప్రజలు ఎటు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. లోలెవల్ వంతెనలు పొంగిపొర్లాయి మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచాయి. మత్తడివాగు ప్రాజెక్టు సామర్థ్యానికి మించి నీరు


ఉట్నూర్

చేరడంతో గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలిపెట్టారు. పంటపొలాలు నీటమునిగి రైతులకు అపార నష్టం వాటిల్లింది. పురాతన ఇండ్లు వర్షం ధాటికి కూలిపోయాయి. పొంగిపొర్లుతున్న వాగుల దగ్గర ప్రజలు వాహనదారులు దాటకుండా పోలీస్ సిబ్బంది కాపలా ఉన్నారు. నీటి ఉధృతి తగ్గిన తర్వాత రాకపోకలకు అనుమతి ఇచ్చారు.

ముధోల్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గత రెండు రోజులగా భారీ వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వాగులు, వంకలు, పొంగిపొర్లాయి. రోడ్లపై నీళ్లు చేరి ప్రజలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలకేంద్రంలోని సాయి మాధవ్‌నగర్‌లో వర్షం నీరు భారీగా ప్రవహించడంతో ఇండ్లలోకి, జ్యోతి భాపూలే పాఠశాలలోకి, వర్షం నీరు చేరింది. అలాగే బస్టాండ్ ఏరియా, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలోకి వర్షం నీరు చేరింది. గాంధీ చౌక్‌లో విద్యుత్ స్తంబం పడిపోవడంతో వెంటనే గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. మండలంలోని వడ్తాల్, భోరిగాం, ముద్గల్, మచ్కల్ గ్రామాల మధ్య ఉన్న లోలేవల్ వంతెన మీదుగా భారీగా వర్షం నీరు ప్రవహించడంతో రాక పోకలు స్తంభించాయి. ఎస్సై సాయికిరణ్ తన పోలీస్ సిబ్బందితో మండలంలో ఆయా గ్రామాలలో పర్యటించారు. అత్యావసర పని ఉంటే తప్ప బయటకు రావద్దని సూచించారు. ఆయా గ్రామశివారులో పలు పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఎడతేరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువులు నిండు కుండల కనిపిసున్నాయి. గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మురికి కాలువలు శుభ్రం చేయడంతో పాటు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.


తాంసి


నార్నూర్

సుభాష్‌నగర్ కాలనీలోని ఇండ్లలోకి నీరు

- తడిసిముద్దయిన నిత్యావసరాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. లోతట్టుప్రాంతాలను వరద ముంచెత్తింది. పలువురు నిరాశ్రయులుగా మారారు. ముఖ్యంగా పట్టణంలోని వార్డు నెంబర్ 13 సుభాష్‌నగర్ కాలనీలోని వంతెన పైనుండి వరదనీరు ఉధృతంగా పారడంతో రాకపోకలకు కొంత అంతరాయం కలిగింది. దీంతో వాగు చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలకు, పరివాహక ప్రాంతాలోని కాలనీవాసులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. రాత్రంతా కంటిమీద కునుకులేకుండా బిక్కుబిక్కుమంటూ గడిపారు. వాగును ఆనుకుని నివసిస్తున్న ప్రజలు అప్రమత్తమయ్యారు. వాగు అతి దగ్గరలో ఉన్న రెండు ఇండ్లలోకి నీరు రావడంతో నిత్యావసరాలు మొత్తం తడిసిపోయాయి. వరదనీటి ధాటికి మట్టిగోడలు పగుళ్లు తేలాయి. పేద కుటుంబంలో ఉన్న తమను ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలంటూ బాధితులు కోరారు.

పేద విద్యార్థులకు వరం



నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు కావడం పేద విద్యార్థులకు వరమని బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఇచ్చోడలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ కాగా, ఎడ్యుకేషన్ సెక్రటరీ వాకటి కరుణ చేతుల మీద బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు జీఓ కాపీని అందుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అంబేద్కర్‌చౌక్‌లో కేసీఆర్, ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు చిత్రపటాలకు బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో ప్రయివేట్ కళాశాలలో ఫీజులు కట్టలేకపై చదువులకు పేద విద్యార్థులు దూరమయ్యారని అన్నారు. కొంతమంది విద్యార్థులు అనేక కష్ట నష్టాలను ఓర్చుకొని దూర ప్రాంతాలకు వెళ్లొస్తవచ్చేదని అన్నారు. సీఎం కేసీఆర్‌ను కలిసి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకి కృషి చేసిన ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు కృతజ్ఞతలు తెలిపారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు జీఓ విడుదలపై మండలంలోని పలు సంఘాల నాయకులు, విద్యావంతులు, ఉద్యోగులు, విద్యార్థులు కేసీఆర్‌కు, ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముస్తఫా, గైకాంబ్లే గణేష్, సురేష్, పురుషోత్తంరెడ్డి, ఆర్గుల గణేష్, మహేందర్‌రెడ్డి, ప్రకాష్, దాసరి భాస్కర్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోడీ కృషి

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

దేశవ్యాప్తంగా రైతుల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోడీ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మావల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని కిసాన్ సేవ కేంద్రాల ప్రారంభం ప్రత్యక్ష ప్రసారాన్ని పార్టీ నాయకులు, రైతులతో కలిసి ఆమె వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పీఎం కిసాన్ సేవా కేంద్రాలు తెలంగాణలో అందుబాటులోకి రానున్నాయని అన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన అన్ని రకాల సేవలు ఒకచోట లభ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరంచు గంగారెడ్డి, కౌన్సిలర్ రఘుపతి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్ రెడ్డి, గన్నోజి విజయ్, ఎంబడి సతీష్, రోహిదాస్ పాల్గొన్నారు.

నేడు మాజీ డీసీసీబీ చైర్మెన్ నాందేవ్ కాంబ్లే వర్ధంతి

నవతెలంగాణ-నార్నూర్

దివంగత మాజీ డీసీసీబీ చైర్మెన్ నాందేవ్ కాంబ్లే రెండో వర్ధంతిని విజయవంతం చేయాలని అన్నబాహుసాతే జిల్లా అధ్యక్షుడు ఉద్ధవ్ కాంబ్లే గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ డీసీసీబీ చైర్మెన్ వర్ధంతిని గుంజాల గ్రామంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సహాయక చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు బాధిత గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ అన్నారు. గురువారం దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల ఎకరాల పంట నష్టం జరిగిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటివరకు ఏ విధమైన చర్యలను తీసుకోలేదని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే దిగివచ్చి ఈ సమస్యలను పరిష్కరించి ప్రజలకు రైతులకు కావాల్సిన వసతులను ఏర్పాటు చేయాలని అన్నారు. వీరితో పాటు జిల్లా నాయకులు, దయాకర్, రత్నాకర్‌రెడ్డి, చిలుకూరి జ్యోతి రెడ్డి, ముకుంద్, అశోక్, రవి, గణేష్, రాజూ, ప్రసాద్, భూమారెడ్డి పాల్గొన్నారు.

అంధకారంలో మండల ప్రజలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాల ప్రజలు 24 గంటలుగా అంధకారంలో కాలం వెళ్లదీశారు. కరెంటు లేక పోవడంతో పిండి గిర్నిలు, తాగు నీటికోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కరెంటు లేక పోవడంతో బ్యాంకు, మీసేవ కేంద్రంలో పనులకు అంతరాయం ఏర్పడింది.

స్వర్ణ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు స్వర్ణ ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1183 అడుగులకు కాగా, ప్రస్తుతం 1182 అడుగులకు చేరుకుంది. ఇన్ ఫ్లో 50వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో అప్రమత్తమైన అధికారులు 6 గేట్ల ద్వారా 45 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దిగువ గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రైతులకు, పశువుల కాపర్లకు, స్వర్ణ నది తీరాన వెళ్లవద్దని అధికారులు సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని ధర్మారం గ్రామ మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి మేనత్త ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వల్లకొండ సత్యనారాయణగౌడ్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యంరెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్, కనకాపూర్ మాజీ సర్పంచ్ మేకల రాజేందర్ యాదవ్, రామగౌడ్ పాల్గొన్నారు.

బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జీఓ నెంబర్ 317 వల్ల నష్టపోయిన బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ నెల 29న చలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బాధిత సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. జీఓ నెంబర్ 317 వల్ల తమ స్థానికతను కోల్పోవాల్సి వచ్చిందని అన్నారు. కుటుంబాలకు దూరంగా బతకాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోలించి, అందరికీ న్యాయం జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అందరూ ఏకతాటిపైకొచ్చి హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టే ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలపాలని, ప్రభుత్వానికి తమ గళం వినిపించాలని పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- నీట మునిగిన పంటపొలాలు పరిశీలన


నిర్మల్

నవతెలంగాణ-నిర్మల్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్, సిద్దాపూర్, జీఎన్ఆర్ కాలనీ ప్రాంతంలో గురువారం పర్యటించారు. ప్రస్తుతం అక్కడి పరిస్థితిని సమీక్షించారు. స్వర్ణ జలాయశయం నుంచి భారీగా వరద నీరు ఉప్పొంగి పొర్లుతుందన్నారు. వాతావరణంలో పెను మార్పుల వల్ల జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతం జీఎన్ఆర్ కాలనీలో పర్యటించి, ముందస్తు చర్యల్లో బాగంగా కాలనీ ప్రజలను స్థానిక ఆర్ఫోస్ స్కూల్‌నకు తరలించాలని కోరారు. ముందస్తుగా అన్ని రకాలుగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని అన్నారు. ప్రజలు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని కోరారు. గత యడాది వరద నీట మునిగిపోయి. ప్రజలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. స్వర్ణ ప్రాజెక్ట్‌లోనికి వరద నీరు భారీగా వచ్చి చేరుతుందని, దిగువ ప్రాంత ప్రజలను ముందుగానే తరలిస్తున్నామని అన్నారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్, కౌన్సిలర్స్ నామెడ గజేందర్, అన్వర్ పాషా, ముజాయిద్ చౌస్, కో ఆప్షన్ కోటగిరి అశోక్, మున్సిపల్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

కుభీర్ : మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు బారీ వర్షం కురవడంతో పలు గ్రామాల్లో ఉన్న పత్తి, సొయా, తదితర పంటలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో పాటు గ్రామంలో ఉన్న చెరువులు, వాగులు, కుంటలు, పొంగిపొర్లాయి. పార్డి(బి) గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కుభీర్‌కు వెళ్లి తిరిగి పార్డి(బి) గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో గుండమార్రె వాగు ఉద్రిక్తంగా పొంగి పొర్లడంతో వాగులో పడిపోయారు. అందులో ఇద్దరు వ్యక్తులు చెట్టు వేర్లను పట్టుకుని ఉన్నారు. దీంతో మరో ఒక యువకుడు 1కిలో మీటర్ దూరం వరదలో కొట్టుకుపోయి చెట్టును పట్టుకుని ఉన్నాడు. వీరిని గ్రామస్తులు, యువకులు చాకచాక్యంతో తాడు సహాయంతో బయటకు తీశారు. అదే విధంగా పంటపొలాలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు, ప్రజలు గురయ్యారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మండలంలోని అంకోలి, చించుగాట్, తంతోలి. మామిడిగూడ, లోకారి, యశ్వంత్‌గూడ, గ్రామాలలో ఇండ్లు, బ్రిడ్జి, రోడ్లను, పంటలను గురువారం ఎంపీపీ గంద్రత్ రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ముందుంటుందని తెలిపారు. ముంపు గురైన పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జంగుబాపు, సర్పంచ్ శ్యామ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు సెవ్వ జగదీష్ యాదవ్, రైతులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని నీటమునిగిన కాలనీల్లో డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్, టీపీసీసీ సభ్యురాలు గంద్రత్ సుజాత పర్యటించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ తిరుగుతూ వారి కష్టాలను తెలుసుకున్నారు. వర్షాలతో తమ ఇల్లు కూలిపోయి ఇబ్బందులు పడుతున్నామని, వర్షపు నీరు ఇండ్లలోకి చేరి ఇబ్బందులు పడుతున్నామని, కాలనీవాసులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భోజన వసతిని కల్పించారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్న స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నగేష్, మాజీ కౌన్సిలర్ ముర్తాజా, సేవాదళ్ అధ్యక్షులు మోతీరాం, టౌన్ వైస్ ప్రెసిడెంట్ సమీర్, వార్డు నాయకులూ ఇమ్రాన్, గౌస్ భాయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాహెర్ ఖాన్, కలీం, రజాక్, హన్ను, రసూల్, హలీం అఫ్సర్, సీనియర్ నాయకులు అక్తర్, హనీఫ్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

బేల : మండలంలోని సాంగిడి, ఏకొరి, నారాయణ్‌పూర్ శివారులో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను గురువారం మండల వ్యవసాయ అధికారి వెండి విశ్వామిత్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంటారని భరోసా కల్పించారు. మండలంలోని రైతులకు అధిక వర్షాల సమయంలో తీసుకోవాల్సిన సూచనలు, సలహాలను వివరించారు. రైతులు మొదటగా పంటల్లో నిలిచిపోయిన నీటినికాలువల ద్వారా పొలం బయటకు పంపే ఏర్పాటు చేయాలని అన్నారు. అధిక వర్షాలు, మబ్బు పట్టిన వాతావరణంలో పంటలకు తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉన్నందున లీటరు నీటికీ 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి పిచికారీ చేసుకోవాలని అన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 30 కేజీలు యూరియా, 10 కేజీల పోటాష్ వేసుకోవాలని అన్నారు. నీరు ఎక్కువగా నిల్వ ఉండి ఎరువులు వేయలేని పరిస్థితుల్లో ఎన్‌పీకే 19:19:19 లేదా 13:0:45 లీటరు నీటికి 5 గ్రాములు కలుపుకొని పిచికారీ చేయాలని అన్నారు. సొయా పంటలో నీరు ఎక్కువైనప్పుడు పై ఆకులు పసులు రంగులోకి మారే అవకాశం ఉంటుందని అన్నారు. నివారణ కొరకు అగ్రోమిన్ మాక్స్ ఎరువును లీటరు నీటికి 5 గ్రాములు చొప్పున కలుపుకొని పిచికారీ చేయాలని అన్నారు. కంది పంటలో ఎండు తెగులు నివారణ కోసం లీటరు నీటికి 3 గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెండి విశ్వామిత్రతో పాటు, ఏఈఓలు ఉమర్, రాజు, జహెద్ రైతులు కన్నాల మహేందర్, ఇట్టడి సుశాంత్‌రెడ్డి, రాకేష్ పాల్గొన్నారు.

తలమడుగు : మండలంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటపొలాలను గురువారం జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి పరిశీలించారు. ఝరి, డోర్లి, కొత్తూరు, రుయ్యాడి, అర్లి(కే), దేవాపూర్, భరంపూర్ తదితర గ్రామాలలో పర్యటించారు. ప్రభావిత ప్రాంతాల రైతుల భూములు కోతకు గురికావడంతో పంట నష్టం వేల ఎకరాల్లో నష్టపోయినట్టు తెలిపారు. నష్టపోయిన రైతులకు ధైర్యాన్ని అందించారు. నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించేందుకు జిల్లా కలెక్టర్‌తో పాటు నాయకులను సైతం కలిసి పంట నష్టంపై వివరిస్తానని తెలిపారు. పంటల నష్టంపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు ఫోన్ ద్వారా వివరించారు. మండల ఉపాధ్యక్షురాలు దివ్య మాధవ్, సర్పంచ్ రఘునాథ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రకాష్‌రావు, మోహన్‌రెడ్డి, రాజు, ఇస్తారి, వినోద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, రైతులు వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.

కుభీర్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్ధార్ విశ్వంబర్ అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించారు. వరదలో చిక్కుకున్న ముగ్గురిని రెవెన్యూ సిబ్బంది కాపాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న 48గంటలు మరింత భారీ వర్షాలు కురవనుందని అన్నారు. దీంతో ప్రజలు బయటకు వెళ్లకుండా చూడాలని తెలిపారు. ఏదైనా సమస్యలు వస్తే పోసులు, రెవెన్యూశాఖ అధికారులకు ముందుగానే సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రేఖమోహన్, అధికారి కవిరాజ్, వార్డు సభ్యులు శేఖర్ గ్రామస్తులు ఉన్నారు.


బేల


తలమడుగు

కనువిందు చేస్తున్న దుద్దులాయి జలపాతం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని కొండపెల్లి బీట్ అటవీ ప్రాంతంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దుద్దులాయి జలపాతం కనువిందు చేస్తుంది. దుద్దులాయి జలపాతానికి వెళ్లాలంటే మండలకేంద్రం నుంచి అగర్‌గూడ గ్రామం మీదుగా కొండపెల్లి అటవీ ప్రాంతానికి చేరుకొని కిలోమీటర్ దూరం కాలినడకన ప్రయాణం చేస్తే దుద్దులాయి జలపాతం చేరుకోవచ్చు. దుద్దులాయి జలపాతం కనువిందుచేస్తుండడంతో యువకులు ఆసక్తి చూపుతున్నారు. జలపాతం వద్దకు రహదారి నిర్మిస్తే పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని పలువురు కోరుకుంటున్నారు.

నేలకొరిగిన వృక్షం..నిలిచిన రాకపోకలు

నవతెలంగాణ-వేమనపల్లి



గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బుధవారం రాత్రి నీల్వాయి నుంచి చెన్నూర్ వెళ్లే మార్గ మధ్యలోని అటవీ ప్రాంతంలో భారీ వృక్షం నేలకొరిగింది. దాంతో వేమనపల్లి మండలానికి రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న నీల్వాయి ఎస్సై సుబ్బారావు, స్థానిక సర్పంచ్ గాలి మధు చొరవ చూపి జేసీబీ సహాయంతో రోడ్డుపై ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

విద్యార్థులకు అర్థమయ్యే భాషలోనే బోధన

నవతెలంగాణ-హాజీపూర్

కేంద్రీయ విద్యాలయంలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు హిందీలో లోనే కాకుండా అర్థమయ్యేలా స్థానిక భాషలో కూడా పాఠాలు బో దించనున్నట్లు మంచిర్యాల కేవీ ప్రిన్సిపల్ శోభన్ బాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం అమలయ్యి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంలో గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ 2020 కేంద్ర ప్రభుత్వం నూతన విద్య విధానాన్ని ప్రవేశ పెట్టిందని పేర్కొన్నారు.1963లో ఏర్పాటైన కేంద్రీయ విద్యాలయాల సొసైటీ నేడు దేశంలో పాఠశాల విద్యనందించడంలో అగ్రగామిగా నిలుస్తున్నదన్నారు. నూతన విద్యా విధానంలో దాదాపు 500 కేంద్రీయ విద్యాలయాల్లో 5 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలకు 'బాల వాటిక' అనే ప్రత్యేక ప్రోగ్రాం తో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు అన్ని విషయాలపై పరిజ్ఞానం వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్లు తెలిపారు. గణితంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని అన్నారు.

వరద ప్రవాహాలతో అప్రమత్తంగా ఉండాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్
- పలు వరద ప్రాంతాల పరిశీలన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వచ్చిన వాగులు వరదల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ సూచించారు. మండలంలోని గుండి వాగు, పెద్దవాగు పరిసర ప్రాంతాలు వరద ప్రవాహాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ఉధృతంగా ఉన్న ప్రాంతాల్లో వాగులు దాటకూడదన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదలకు సంబంధించి అత్యవసర సేవలు అవసరమైన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని తెలిపారు. ప్రాణ నష్టం కాకుండా నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు. మరో 48 గంటల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే ఇండ్లలో నుండి బయటకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయి గురువారం అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో గల సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డెలివరీ, జనరల్ వార్డుల పరిశీలించారు. అప్పుడే జన్మించిన శిశువుకు కేసీఆర్ కిట్టును అందజేశారు. గతకొన్ని రోజుల నుంచి ఖాళీగా ఉన్న దోబి పోస్టును భర్తీ చేయాలని ఆస్పత్రి సిబ్బంది పీఓ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఆమెతో పాటు ఎంపీపీ ముండె విమలాబాయి, డాక్టర్ వినయ్, సిబ్బంది ఉన్నారు.

అధికారులతో ఎంపీపీ సమీక్షా సమావేశం

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ముండె విమలాబాయి కార్యదర్శులు, టీఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలకు సంబంధించిన కార్యదర్శులు ఎప్పటికప్పుడు ఎంపీఓకు సమాచారం తెలియజేయాలన్నారు. మండలంలో పండ్ల తోటల కోసం ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో తుంపర సేద్యం పరికరాలు అందిస్తుందని, బోరుబావులు, విద్యుత్ సౌకర్యం ఉన్న రైతులు వెంటనే ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు. సమావేశంలో ఎంపీఓ శివకుమార్, ఏపీఓ శ్రావన్, కార్యదర్శులు, టీఏలు, ఎస్‌ఏలు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డు సదుపాయం కల్పించాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు,హెల్త్ కార్డుల సదుపాయం కల్పించాలని క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు గురువారం సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డుల ద్వారా లేకలు పోస్టు చేశారు. ఈ సందర్భంగా ప్రస్ క్లబ్ అధ్యక్షుడు కలువల శ్రీనివాస్ మాట్లాడుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్, ప్రధాన కార్యదర్శి విరహత్ ఆలీ పిలుపు మేరకు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతో పాటు హెల్త్ కార్డులు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని పోస్ట్ కార్డుల ద్వారా కేసీఆర్‌కు పోస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. అధికారం చేపట్టి నాటి నుంచి ఇప్పటి వరకు జర్నలిస్టులకు ఎలాంటి సహకారం అందించలేదని అన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర వ్యాప్తంగా పోస్టు కార్డు ఉద్యమం చేపట్టినట్టు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రామిల్ల శ్రీనివాస్, కోశాధికారి పరికిపండ్ల రాజు, ఉపాధ్యక్షులు తూముల భవిష్యత, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామిడి సాయి సజన్, ఇన్‌ఛార్జి చొప్పదండి జనార్ధన్, సభ్యులు అనిల్, రమేష్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన కండ్లే గంగవ్వ, అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబానికి బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకురాలు జాదవ్ సుమన్‌భాయ్ రూ.5000 ఆర్థిక సాయం అందించారు. గురువారం కవ్వాల్ గ్రామానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కార్యదర్శి, రాజన్న, రవి, ఆర్య లక్ష్మణ్ బాదావత్ వినోద్, ఏ.తిరుపతి ఉన్నారు.

మంచిర్యాలలో అప్రమత్తమైన అధికార యంత్రాంగం

- జిల్లా ప్రత్యేక అధికారిగా భారతి హోళికేరీ
- ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే
- వరద సహాయక చర్యల్లో వివిధ శాఖల అధికారులు



హాజీపూర్ : ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ఎమ్మెల్యే, కలెక్టర్

నవతెలంగాణ-హాజీపూర్


ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను గురువారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు పరిశీలించారు. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు, ఎగువన కడెం, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్‌ల గేట్లు ఎత్తి వేయడంతో ఎల్లంపల్లికి భారీగా వరద నీరు చేరుతుంది. దీంతో ప్రాజెక్ట్‌కు 5లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో 32 గేట్లను ఎత్తి వేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి వరద పోటు వచ్చే అవకాశం ఉండడంతో లోతట్టు ప్రాంతాలు ఖాళీ చేయిస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద వరద ప్రవాహంపై కలెక్టర్, ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులతో వివరాలు సేకరించారు. డీసీపీ రాంనాథ్ కోకెన్ ప్రాజెక్ట్ వద్ద కలెక్టర్, ఎమ్మెల్యేలతో వరద పరిస్తితిపై పోలీస్ ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యలను వివరించారు.

జిల్లా ప్రత్యేకాధికారిగా భారతి హోళికేరి

వరదలతో జిల్లా అతలాకుతలం అవుతున్న నేపథ్యంలో రాబోవు రెండు రోజులు వర్షాల హెచ్చరికతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేక అధికారిగా గతంలో ఇక్కడ పని చేసిన అనుభవం ఉన్న కలెక్టర్ భారతి హోళికేరిని నియమించింది. గురువారం సాయంత్రం వరకు జిల్లాకు రానున్న ఆమె అధికారులతో వరదలపై ఎ ప్ప టి క ప్పు డు సమీక్షిస్తున్నారు.

వరద సహాయక చర్యల్లో రావాణా శాఖ

ప్రస్తుతం కురుస్తున్న వరదలతో వచ్చే ముప్పులో రావాణా శాఖ కూడా సహాయక చర్యల్లో పాల్గొంటోందని ఇన్‌ఛార్జి జిల్లా రవాణ అధికారి వివేకానందరెడ్డి అన్నారు. ఈ విషయమై గురువారం జిల్లా రావాణా శాఖ కార్యాలయంలో సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ సంతోష్, ఉప రవాణా కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ ఆదేశాల మేరకు ప్రస్తుతం కురుస్తున్న భారీ, అతి భారీ వర్షాలకు సంబంధించి ప్రతి రోజూ సమీక్ష చేస్తూ, అప్రమత్తంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, వాహన దారులు అత్యవసర పరిస్థితుల్లో తప్ప రోడ్ల పైకి రావద్దని సూచించారు. రోడ్లపై నీరు ప్రవహిస్తున్నట్లైతే దాటవద్దని, రోడ్డుపై నీటితో హైడ్రో ప్లేన్ వల్ల వాహనం టైర్లు రోడ్‌తో పటుత్వం కోల్పోయి జారి పోయే ప్రమాదం ఉంటుందని నెమ్మదిగ వాహనాలు నడపాలన్నారు. నీళ్లలో నుంచి వాహనం నడపవద్దు దాని వల్ల ఇంజన్‌లో నీరు చేరి ఇంజన్ జామ్ అయ్యే అవకాశం ఉందన్నారు. ఇలాంటి సందర్భాలలో వాహనం ఆగిపోయినట్లైతే, నెట్టి స్టార్ట్ చేయకుండా, మెకానిక్‌ని సంప్రదించాలనారు. లేనట్లయితే ఇంజన్ పాడై ఇన్సూరెన్స్ కవరేజ్ కూడా రాదన్నారు. ఇతర వాహనాలకు కనబడేట్లు పార్కింగ్, హజార్డ్ లైట్లు వేసుకొని వాహనం నడపాలన్నారు. ఎక్కడైనా నీళ్లలో వాహనం కానీ ఇంకా ఎవరైనా కానీ చిక్కుకున్నట్లయితే సహాయం కొరకు హెల్ప్ లైన్ 08736250501 నెంబర్‌కు గాని100కు గాని ఫోన్ చేసినట్లయితే వారిని రక్షించడానికి యంత్రాంగం తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారి రాహుల్ కుమార్, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.



జైపూర్ వేలాల శివారులో పొంగి ప్రవహిస్తున్న గోదావరి



జన్నారంలో ప్రజల తరలింపు



జైపూర్ ముంపు ప్రాంతాల్లో ఏసీపీ

జైపూర్ : మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. విషయం తెల్సుకున్న జైపూర్ ఏసీపీ మోహన్, తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణ గురువారం వేలాల, శివ్వారం గ్రామాలను సంధర్శించారు. భారీగా కురుస్తున్న వర్షాలతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నందున అత్యవసరం అనుకుంటే తప్పా ఇంటి నుండి బయటకు వెళ్లకూడదని హెచ్చరించారు. టేకుమట్ల శివారులో రసూల్‌పల్లి పెద్ద వాగు, పెగడపల్లి శివారంలో ఈదుల వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎగువ నుండి వస్తున్న వరద నీటితో గోదావరి నది పొంగి ప్రవహిస్తోంది. పార్వతి బ్యారేజ్ నుండి వరద నీటిని ఎప్పటికప్పుడు దిగువకు వదులుతున్నారు. 6 లక్షల క్యూసెక్కులఅ వుట్ ఫ్లో కొనసాగుతుందని అధికారులు తెలిపారు. క్రమేపీ వరద ఉధృతి పెరుగుతున్నందున తీర ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. కడెం రిజర్వాయర్ ప్రమాదకర పరిస్థితుల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితుల్లో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. లోతట్టు ప్రాంత కుంటుంబాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాటు చేస్తున్నారు. వేలాల గ్రామంలో గల పీహెచ్‌సీ, జడ్పీ పాఠశాల, రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన శిబిరాలకు తరలి రావాలని సూచిస్తున్నారు. అదేవిధంగా శివ్వారంలో గ్రామ పంచాయతి భవనం, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన శిబిరాలకు తరలిపోవాలని సూచిస్తున్నారు. భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతి కార్యదర్శులు స్థానికంగా ఉండి గ్రామీణులను అప్రమత్తం చేయాలని ఎంపీడీఓ సత్యనారాయణ ఆదేశించారు. మంచిర్యాల డీఎల్‌పీఓ ప్రభాకర్‌తో కలిసి జైపూర్ ఏసీపీ మోహన్ కుందారం పెద్దవాగు వరద ఉధృతిని పరిశీలించిన అధికారులు ప్రమాదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శ్రీరాంపూర్ సీఐ రమేష్ బాబుతో పాటు స్థానిక ఎస్సై ఉపేందర్ రావు, ఎంపీఓ అనిల్ కుమార్ పరిస్తితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు

జన్నారం : మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారం యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గురువారం తహసీల్దార్ ఇటిక్యాల కిషన్, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, లక్షెట్టిపేట సీఐ కృష్ణ, జన్నారం ఎస్సై సతీష్ పర్యవేక్షణలో వాహనాల ద్వారా రోటిగూడలోని 40 కుటుంబాలను, ధర్మారం గ్రామ పంచాయతీ పరిధిలోని గోండుగూడలో 20 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కడెం ప్రాజెక్టు నుంచి 16 గేట్లు, శ్రీరామ్ సాగర్ నుంచి 18 గేట్లు ఎత్తివేయడంతో, గోదావరి నది వరద ప్రవాహం ఉగ్రరూపం దాల్చింది. దీంతో అధికారం యంత్రాంగం ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసింది. ర్యాపిడ్ ఫోర్స్‌ను రంగంలోకి దింపి అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. లోతట్టు గ్రామాల్లో ఎంపీడీఓ అరుణారాణి, రమేష్‌లు పర్యటించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. భారీ వర్షాలకు మండలంలోని, గోదావరి పరివాహ ప్రాంతాలైన కలమడుగు, ధర్మారం, బాదంపల్లి, చింతగూడ రోటి గూడ, తపాలాపూర్, తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

కోతకు గురైన రోడ్డు

మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ నుంచి బాదం పెల్లి వెళ్లే ప్రధాన రహదారిలో బ్రిడ్జి వద్ద వరద ఉధృతిఇ రోడ్డు కొట్టుకుపోయింది. బుంగపడి కోతకు గురైన రోడ్డుని సర్పంచ్ జక్కు భూమేష్ ఈఓ రాహుల్, బాదంపెల్లి కార్యదర్శి ఆధ్వర్యంలో ఇసుక సందులతో నెట్ వేసి వరద ఆధృతిని అదుపు చేశారు.

కదం తొక్కిన పంచాయతీ కార్మికులు

- కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం
- గేట్లపై నుంచి కలెక్టరేట్‌లోకి చొరబడిన కార్మికులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమస్యల పరిష్కారానికి జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పంచాయతీ కార్మికులు కదంతొక్కారు. కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం జిల్లా కేంద్రంలో ఉద్రిక్తంగా మారింది. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి కార్మికులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఉదయం నుంచి కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపిన కార్మికులు ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు నిలువరించడానికి ప్రయత్నం చేసినప్పటికీ కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావడంతో వారు చేతులెత్తేశారు. గేట్లు తీయడానికి పోలీసులు నిరాకరించడంతో పైనుండి ఎక్కి పెద్ద ఎత్తున కార్మికులు కలెక్టరేట్‌లోకి చొరబడ్డారు. కలెక్టర్ ఛాంబర్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. దాదాపు గంటపాటు కలెక్టరేట్ కార్యాలయం నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యల పరిష్కరించడంలో చొరవ చూపడం లేదన్నారు. వెంటనే డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. పంచాయతీల పరిశుభ్రతలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నప్పటికీ తమను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇచ్చేవరకు కదిలేది లేదని కార్మికులు తేల్చి చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో లేకపోవడంతో డీఆర్ఓ రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకు వెళ్తామని పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికులు చేపట్టిన ముట్టడి కార్యక్రమానికి వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు రాజేందర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, పంచాయతీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు శంకర్, జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు తోట సమ్మయ్య, బి.నాగేశ్వర్, ఎస్కే తాహేర్, ఎస్.నవీన్, సీహెచ్ సునీత, సుగుణ, లక్ష్మి, సుశీల, పెంటక్క, ఇప్ప రాజు, సిహెచ్ హుక్కు, కే.వెంకటేష్, కే.తిరుపతి పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

రైతు బీమాలో నమోదు కాని రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ యువరాణి తెలిపారు. గురువారం మండలంలోని బోడపెల్లి, జగన్నాథ్‌పూర్ పంచాయతీల్లో రైతు బీమా దరఖాస్తులను స్వీకరించారు. అర్హులై ఉండి ఇంకా రైతుబీమా కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని రైతుల వివరాలను సర్పంచ్‌లకు అందజేశారు. ఏఈఓ మాట్లాడుతూ రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోని అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టదారు పాస్ పుస్తకం కలిగి 18 నుండి 59 ఏండ్ల లోపు వయసుగల రైతులు ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్, ఎన్ రోల్ మెంట్ ఫారం జతపరిచి ఏఈఓలకు అందజేయాలన్నారు. రైతు, నామినీ పేర్లు తప్పుగా నమోదైనా సవరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. జూన్ 18 వరకు పట్టాపొందిన రైతులు సైతం బీమా కోసం ఆగస్టు 5 లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచిలు కల్లెపల్లి మీనారాజన్న, డోకె రవి, రైతులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : కొత్త పట్టా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు రైతుబీమా నమోదు చేసుకోవాలని ఏఈఓ శ్రీవిద్య అన్నారు. గురువారం మండలంలోని కొండపెల్లి గ్రామంలో రైతుబీమా నమోదుచేసుకోని రైతుల నుండి వివరాలు సేకరించి నమోదు చేసినట్టు, ప్రతి ఒక రైతు ఈ నెల 30వ తేదీలోపు రైతుబీమాకు నమోదు చేసుకోవాలన్నారు.

చూడబోతే.. చుట్టుముట్టింది

- పెసరుకుంట గ్రామంలో చిక్కుకున్న తహసీల్దార్

నవతెలంగాణ-దహెగాం

విధి నిర్వహణలో భాగంగా వరద ప్రభావిత ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడానికి వెళ్లిన తహసీల్దార్‌కు వరద నీరు చుట్టూ చేరడంతో ముంపులో చిక్కుకున్న సంఘటన గురువారం దహెగాం మండలంలో చోటుచేసుకుంది.

పెద్దవాగు అనుసంధానంగా ఉన్న కుమురంభీం, అడా ప్రాజెక్టు గేట్లు పూర్తిగా ఎత్తడంతో వరద ప్రభావం భారీగా పెరిగింది. దీంతో పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసే పనిలో భాగంగా ముంపు గ్రామమైన పెసరుకుంట గ్రామానికి తహసీల్దార్ రాథోడ్ ప్రహ్లాద్ వెళ్లారు. గ్రామానికి వెళ్లే క్రమంలో వరద ప్రభావం లేదు. కానీ గ్రామానికి చేరిన కొద్దిసేపటికే వరద ఉధృతి పెరిగి లోలెవల్ వంతెనపై వరద నీరు భారీగా చేరడంతో దాటే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో పెసరుకుంట గ్రామంలోనే తహసీల్దార్ ఉండాల్సి వచ్చింది.

ముచ్చటగా మూడోసారి..

మండలంలో గత 30 సంవత్సరాల తరువాత వరుసగా మూడు సంవత్సరాలుగా పెద్దవాగు తన ఉగ్రరూపాన్ని చూపిస్తోంది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో కుమురంభీం, అడా ప్రాజెక్టుల నీటి పట్టంపెరగటంతో మొత్తం గేట్లు ఎత్తివేసి నీటిని దిగువన వదులుతున్నారు. వర్షాల వల్ల చిన్నాచితక వాగులు ఉప్పొంగి పెద్దవాగులో కలుస్తుండడంతో వరద ఉధృతి ఏటా పెరుగుతూ పోతుంది. దీంతో ముచ్చటగా మూడోసారి కూడా రైతులు తమ పంటలను కోల్పోవాల్సి వచ్చింది. ప్రతీ సంవత్సరం పంట తొలి దశలోనే వరద నీరు ముంచెత్తుతుండడంతో రైతన్నలు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. మొలకదశలోనే ఇట్యాల, రాళ్లగూడ, బోర్లకుంట, కొత్మీర్, బీబ్రా, ఐనం, దహెగాం, లగ్గాం, ఒడ్డుగూడతో పాటు దిగువన ఉన్న పెద్దవాగు పరివాహక ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.



పెంచికల్‌పేట్ : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పాటు అడా ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో పెద్దవాగులో వరద ఉధృతి భారీగా పెరిగింది. పెద్దవాగు వద్ద అప్రోచ్ రోడ్డును, వరద ఉధృతిని జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, తహసీల్దార్ సరిత, పెంచికల్‌పేట్, దహెగాం ఎస్సైలు కొమురయ్య, సనత్‌కుమార్, దహెగాం జడ్పీటీసీ రామారావు పరిశీలించారు. వంతెన నుండి భారీ వాహనాలు వెళ్లకుండా పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. పెద్దవాగు వరద ఉధృతితో ఎల్లూరు, అగర్‌గూడ, కమ్మర్‌గాం శివారులో పత్తి పంట నీటి మునిగింది. పెద్దవాగు ఉధృతికి గుండెపెల్లి-కమ్మర్‌గాం, అగర్‌గూడ-కమ్మర్‌గాం, పెంచికల్‌పేట్-అగర్‌గూడ గ్రామాలకు వరద ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. బొంబాయిగూడ నుండి ఎర్రగుంటకు వెళ్లే రహదారిలో గల ఉచ్చమల్లెవాగు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిపివేయాలని తహసీల్దార్ సరిత ఆదేశించారు. వరద ఉధృతిని ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పద్మశాలి సంఘం నూతన అధ్యక్షునికి సన్మానం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్ గ్రామం పద్మశాలి సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన వాసాల నరేష్‌ను ఆ గ్రామ రిటైర్డ్ ఉపాధ్యాయుడు నోముల మధుసూదన్ గ్రామ యూత్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంకం మహేష్, నస్పూర్ సోను, ఉల్వకాని మల్లేష్, ముంజంపల్లి సాయి, గంగారపు రాము, అట్టెం అంజన్న, చౌక మహేష్, రాగుల శ్రీకాంత్, సుర్మిల భాస్కర్, గట్టు మహేష్ యాదవ్, నస్పూరి తిరుపతి అన్నరపు అశోక్, బొమ్మెడి రాజేందర్ పాల్గొన్నారు.

ఈదులవాగుతో ఇబ్బందులు పరిష్కరించాలి

నవతెలంగాణ-జైపూర్

వర్షాకాలం వచ్చిందంటే పెగడపల్లి-జైపూర్‌ల మధ్య ఈదుల వాగు మీదుగా రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోందని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దాసారపు శ్రీనివాస్ పేర్కొన్నారు. భారీగా కురుస్తున్న వర్షాలతో పెగడపల్లి ఈదుల వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నట్లు తెల్సుకున్న ఆయన గురువారం స్థానికులతో కలిసి మాట్లాడారు. నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షాలతో టేకుమట్ల శివారులో పెద్దవాగు, పెగడపల్లి-జైపూర్ మధ్య ఈదుల వాగు పొంగి ప్రవహిస్తున్నందున ఈ రహదారుల మీదుగా రాకపోకల ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోందని పేర్కొన్నారు. రెండు సంవత్సరాలుగా ఎదురవుతున్న ఇబ్బందుల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈదుల వాగు, టేకుమట్ల వాగులపై వరద ఇబ్బందులు లేకుండా చుట్టు ఉన్న పది గ్రామాల వారి సౌకర్యార్థం శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు కదం శ్రావన్, రాజేష్, రాకేష్, ప్రవీణ్, సాయి, వంశీ ఉన్నారు.

నవోదయలో క్లస్టర్ క్రీడా పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జెడ్పీ వైస్ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎస్పీఎం యూనిట్ హెడ్ అమరేంద్రకుమార్ మిశ్రా ప్రారంభించారు. జ్యోతి వెలిగించి, క్రీడా జెండాను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని తొమ్మిది జవహర్ నవోదయ విద్యాలయాల నుండి వచ్చిన క్రీడాకారులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో కూడా రాణించాలని అన్నారు. సెల్‌ఫోన్, ఆన్‌లైన్ క్రీడలకు దూరంగా ఉండాలని సూచించారు. నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ బి చక్రపాణి క్రీడా ప్రగతిని వివరించారు. పోటీల ప్రారంభం సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలపై చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం డీజీఎం సురేందర్ నిరత్కర్, జీఎం ఎంఎస్ గిరి పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ప్రముఖ పాత్ర

- విద్యాలయంలో 3వ ఆవిర్భావ వేడుకలలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ విద్యా విధానం-2020 అమలులో కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ప్రముఖపాత్ర పోషిస్తోందని ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్ అన్నారు. గురువారం కేంద్రీయ విద్యాలయంలో జాతీయ విద్యా విధానం 2020 అమలు, 3వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఒకటి నుంచి మూడవ తరగతి వరకు నూతన విద్య విధానం ప్రకారం శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. పిల్లలకు నైపుణ్యంలో ప్రావీణ్యతకు పెద్దపీట వేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఈపీ విజన్, నిపుణ్ భారత్ ఇనిషియేటివ్స్, బాల వాటిక పరిచయం, విద్యాప్రవేశ్, వృత్తికి సంబంధించిన విషయంలో పిల్లలకు కల్పించాల్సిన అవగాహన, పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర, ఉపాధ్యాయులకు బోధనపరమైన మార్పు, శిక్షణ వంటి అనేక అంశాలపై వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో విద్యాలయ ఇంచార్జి ప్రిన్సిపాల్ అశోక్, ఏఎఫ్ఏ దుండిగల్ ప్రిన్సిపాల్ హరిప్రసాద్‌తోపాటు ఇతర విద్యా సంస్థల ప్రిన్సిపల్స్, విద్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన ఏడీఏ

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని బుగ్గారం, కుప్టి, చిన్న బుగ్గారం, కొర్టికల్ గ్రామాల్లో గురువారం ఏడీఏ శ్రీధర్ స్వామి పర్యటించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధైర్య పడొద్దన్నారు. పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు.

ఎల్‌ఓసీ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - రెబ్బెన

ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆర్థిక సాయం అందుతుందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శకాలనీకి చెందిన ఎ మూర్తి అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండుకు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌ఓసీ చెక్కును మంజూరైన పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మూర్తి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జైనూర్‌కు మైనార్టీ బాలికల పాఠశాల మంజూరు

నవతెలంగాణ - జైనూర్

జైనూర్‌కు మైనార్టీ బాలికల పాఠశాల మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మైనార్టీ బాలికల పాఠశాల మంజూరు చేయాలని గతంలో మైనార్టీలు తమకు వినతిపత్రం ఇచ్చారన్నారు. మైనార్టీ పేద బాలికలకు ఉన్నత విద్యనందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. సెక్రటరీ గోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో మైనార్టీ బాలికల పాఠశాల మంజూరైనట్టు పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాల నుండి మైనార్టీలు కోరుతున్న పాఠశాల ఏర్పాటుకు కృషి చేశానని తెలిపారు. మైనార్టీ బాలికల పాఠశాల మంజూరైనందుకు మండల మైనార్టీలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

6వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ - రెబ్బెన

ఈ నెల 29, 30వ తేదీల్లో కొత్తగూడెంలో జరిగే సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) ఆరో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం గోలేటిలోని సీఐటీయూ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని తరగతుల కార్మికుల జీతాలు ఎంతోకొంత పెరుగుతున్నప్పటికీ ఒక సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెరగడం లేదన్నారు. కొత్తగూడెంలో జరిగే మహాసభలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల స్థితిగతులను, అతితక్కువ చెల్లిస్తున్న వేతనాల గురించి చర్చించి మెరుగైన వేతనాల పోరాట కార్యక్రమం నిర్వహించడానికి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చిన్నుబాయి, శారద, విజయలక్ష్మి, లక్ష్మి, సాలమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



భారీ వర్షాల కారణంగా మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో వాటర్ లీకేజీలు అవుతున్నాయని ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని జెడ్పీటీసీ అర్క పుష్పలత డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆస్పత్రిలోని పైకప్పులు నుంచి నీరు లికేజ్ అవుతుందని అన్నారు. ఈ వాటర్ లీకేజీల వల్ల మెటర్నిటీ వార్డులో బాలింతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మందులన్ని తడిసి ముద్దయని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, పీఓ చాహత్ బాజపాయ్‌లు వెంటనే ఇంద్రవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, అస్పత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగం, గిరిజన మోర్చ జిల్లా అధ్యక్షుడు మరప రాజు, జిల్లా స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దీపక్ సింగ్ షేకావత్, ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు అడవ్ చంపత్ రావు, మాజీ ఉప సర్పంచ్ మస్కే రాజ వర్ధన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించకుంటే కఠిన చర్యలు

- జడ్పీ చైర్పర్సన్ కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజా సమస్యలపై స్పందించకుంటే అధికారులపై కఠిన చర్యలు తప్పవని జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి హెచ్చరించారు. ఎంపీపీ మల్లికార్జున్ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సమావేశంలో ప్రతి శాఖకు చెందిన అధికారి హాజరయ్యేలా చూడాలని ఎంపీడీవోకు సూచించారు. మండల అధికారులు అందుబాటులో ఉంటేనే ఆ సమస్యపై చర్చించి పరిష్కారం అయ్యేలా చూడొచ్చని తెలిపారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మాణిక్‌గూడ వద్ద రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆసిఫాబాద్ నుంచి తుంపెల్లికి వెళ్లే గూడెంఘాట్ వంతెన చిన్నపాటి వర్షాలకు మునిగిపోతుందని తెలిపారు. తుంపెల్లి వద్ద వంతెన నిర్మాణానికి ఎస్టిమేట్లు తయారు చేసి పంపించాలని సూచించారు. పోడు భూములకు ఇచ్చిన పట్టాల్లో రైతులు బోర్లు వేసుకుంటే అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. క్రీడా పాఠశాలను పాత కలెక్టరేట్‌లో మార్చి ఆశ్రమ బాలికల పాఠశాలను తిరిగి ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంపీపీ మల్లికార్జున్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ సేవలు లేకపోవడంతో ఇప్పటివరకు ముగ్గురు మృతి చెందారని గుర్తు చేశారు.

సమావేశంలో చర్చకొచ్చిన అంశాలు

బూరుగూడ గ్రామపంచాయతీలో ఇప్పటివరకు యూరియా డిఏపి పంపిణీ చేయలేదని, చిలాటిగూడ గ్రామపంచాయతీలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మన ఊరు మనబడికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని, జెండాగూడ గ్రామపంచాయతీలోని ప్రభుత్వ పాఠశాల భవనం పైకప్పు శిథిలావస్థకు చేరుతుందని అన్నారు. మండల వ్యాప్తంగా టీచర్ల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించాలని, మిషన్ భగీరథ నీళ్ల గ్రామాల్లో సరఫరా కావడం లేదని తెలిపారు. జెండాగూడ, అప్పపెల్లి గ్రామాల్లో నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి వాటి చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్ పోచయ్య, ఎంపీడీవో శశికళ, మార్కెట్ కమిటీ చైర్మన్ గాధవేణి మల్లేష్, వైస్ ఎంపీపీ సుంకరి మంగ పెంటయ్య సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇండ్లలోకి వరద నీరు.. తడిసిన నిత్యావసర సరుకులు

- నీటమునిగిన పంటలు... • తెగిన వంతెనలు • రాకపోకలకు అంతరాయం



నవతెలంగాణ-తలమడుగు

ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు గురువారం మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లి, వరదనీరు ఇండ్లలోకి చేరింది. దీంతో నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి. పలు చోట్ల వంతెలు తెగిపోయి, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా రైతులు పంటకుల వేసేందుకు తీసువచ్చిన ఎరువులు సైతం తడిసిపోయాయి. భరంపూర్ గ్రామానికి రైతు శ్రీనివాస్‌రెడ్డి చెందిన రెండెకరాల పత్తి పంట, అదే గ్రామ రైతు లక్ష్మారెడ్డికి చెందిన మూడెకరాల పత్తిపంట పూర్తిగా దెబ్బతిన్నట్టు పేర్కొన్నారు. భారీ వర్షంతో నీటి ప్రవాహం పెరిగి వంతెనలపై నుంచి వరద పొంగిపొర్లడంతో వరద ఉధృతికి వంతెన కొట్టుపోయింది. మండలంలోని పలు గ్రామాల్లో ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇంట్లోని బియ్యం, పప్పుధాన్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులు నీట మునిగి పనికి రాకుండా పోయాయి. మండలంలోని ఎస్టీ కాలనీలో నీటమునుగడంతో వంట చేసుకోవడానికి స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో అదే కాలనీకి చెందిన తిరుపతిరావు అనే వ్యక్తి తన ఇంట్లో వంట చేసి వరద బాధితులకు భోజనాలు పెట్టించారు. మండలంలోని ఉమ్రి, కప్పర్‌దేవి, డోర్లి, తలమడుగు, భరంపూర్, దేవాపూర్, సుంకిడి, ఖోడద్, తదితర గ్రామాల రైతుల పంట చేన్లలో నీరు పారడంతో వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. డోర్లి, తలమడుగు, సుంకిడి, ఖోడద్, అర్లి(కె), భరంపూర్, రుయ్యాడి, గ్రామాల వంతెనలపై నుంచి ఉద్రిక్తంగా నీరు ప్రవహించడంతో భరంపూర్ గ్రామ సమీపంలోని లోలెవల్ వంతెన కొట్టుకుపోవడంతో 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా ఖోడద్, హస్నాపూర్ గ్రామాల మధ్యనున్న వంతెనపై వరద నీరు పారడంతో వందలాది వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద బాధితులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్రమత్తమైన మండల అధికారులు...

భారీ వర్షాలతో మండల అధికారులు వర్షంలో సైతం వంతెనల వద్దకు చేరుకొని మండల ప్రజలను అప్రమత్తం చేశారు. గ్రామ సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులను ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ రాత్రి పగలు ఎట్టి పరిస్థితుల్లోనూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. స్థానిక ఎస్సై ధనుశ్రీ, ఎంపీడీఓ రమకాంత్, ఎంపీఓ దిలీప్ కుమార్ వర్షంలో పర్యటించారు. పరిస్థితులను సమీక్షించారు.

పంటలు నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలి

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఛలో కలెక్టరేట్
- ఆర్డీఓకు నాయకుల వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని కోరుతూ గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ స్రవంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. పదిరోజులుగా భారీనుండి అతిభారీ వర్షాలు కురుస్తున్నా ప్రభుత్వం ఎలాంటి సహాయ చర్యలు చేపట్టడంలేదని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే మత్తడివాగు, సాత్నాల వాగు ప్రాజెక్టులు నిండుకుని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయని అన్నారు. రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం ఎలాంటి హామీ లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. డీసీసీ జిల్లా అధ్యక్షులు సాజిద్ ఖాన్, టీపీసిసి ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని అన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అటు కడెం ప్రాజెక్టు అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా డేంజర్ జోన్‌లోకి వెళ్లిపోయిందని మండిపడ్డారు. ముందుచూపుతో స్పందించి ఉంటే ఇవాళ ఈ దుస్థితి ఉండేదికాదని అన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, పరివాహక ప్రాంతాల్లో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేఖర్, కన్న ప్రభాకర్‌రెడ్డి, మూర్తుజ, మఫారి సంఘం జిల్లా అధ్యక్షులు నాయిని సుదర్శన్, బీంసరి ఉపసర్పంచ్ మల్లయ్య, సేవాదల్ జిల్లా అధ్యక్షులు మోతీరాం, దుర్గానగర్ లింగన్న, దండు మధుకర్, నాయకులు ఉన్నారు.

వరద బీభత్సం.. నీట మునిగిన పంటలు



- ఉప్పొంగిన త్రివేణి సంఘం చెరువు
- ప్రధాన రహదారికి గండి
- మండలంలో 184.02 మి.మీ. వర్షపాతం నమోదు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నీటి ప్రవాహంతో వరద ఉధృతి పెరిగింది. దీంతో పంటలు నీటమునిగాయి. చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చిత్తాభట్ట, జైత్రాంతండ, జెండాగూడ పరిసర వాగులు పోర్లాయి. వీరంతా భాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. మండలంలో ఎన్నడూ లేనివిధంగా 184.02 మీ.మీ.వర్ష పాతం నమోదైంది. రాత్రంతా ఉరుములు, మెరుపులు, రాళ్లతో కూడిన భారీగా వర్షం కురువడంతో ప్రజలు రాత్రంతా భయంతో బిక్కు బిక్కు మంటు కాలం గడిపారు. ముత్నూర్ చెరువు ఉధృతంగా పొంగడంతో ప్రధాన రోడ్డు కోతకు గురైంది. దీంతో జిల్లా కేంద్రం నుంచి కుమురం భీమ్, మంచిర్యాల, ఉట్నూర్ వైపు వీళ్లే వాహనాలకు వస్వే మార్గంలో ప్రయాణించాయి. స్థానిక పోలీసులు ఎలాంటి ప్రమాదం జరుగకుండా, భారీ వాహనాలు వెళ్లకుండా ముందు జాగ్రత్తలు చేపట్టారు. వాగు పరివాహక గ్రామాలైన వడగావ్, గౌరాపూర్, బిక్కు తండ, వాల్గోండ, శంకర్ గూడ, లాల్‌టెక్డి, దస్నాపూర్ తదితర గ్రామాల్లో సోయా, పత్తి, టమాటా పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. పంట నష్టంపై అధికారులు సర్వే నిర్వహించి, రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

చెరువులు, కందకాలు కబ్జాతోనే విపత్తు

- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కాంగ్రెస్ నాయకులు కూచాడి శ్రీహరిరావు



నవతెలంగాణ-నిర్మల్

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆయన అనుచరులు చెరువులు, కందకాలు, కుంటలను కబ్జాలు చేయడంతోనే నిర్మల్ పట్టణం మళ్లీ నీట మునిగిందని కాంగ్రెస్ నాయకులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. భారీ వర్షాలతో నీట మునిగిన జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ఎక్స్ రోడ్, శాంతినగర్, రవినగర్, విద్యానగర్, జీఎన్ఆర్ కాలనీ, విశ్వనాథ్‌పేట్, వైఎస్సార్‌నగర్ కాలనీలో గురువారం పర్యటించారు. నీట మునిగిన కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొలుసుకట్టు చెరువులను కబ్జా చేసి ఎఫ్టిఎల్ బఫర్ జోన్లలో అక్రమంగా కట్టడాలు నిర్మించడంతో భారీ వర్షాలతో రోడ్లన్నీ జలమయమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నీట మునిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న అధికారులు ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేదని విమర్శించారు. గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు తీసుకోవడంలో జిల్లా యంత్రాంగం విఫలమైందని విమర్శించారు. జిల్లా కలెక్టర్ స్పందించి నాళాలపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు సాధించిన దుర్గం తేజ

నవతెలంగాణ - కౌటాల



మండల కేంద్రానికి చెందిన దుర్గం తేజ జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో 2741 ర్యాంకు సాధించి బెంగుళూరు ఐఐటీలో మెకానికల్ ఇంజనీర్‌గా సీటు సాధించాడు. ఒకటో తరగతి నుండి నాలుగో తరగతి వరకు మండల కేంద్రంలోని ప్రయివేటు పాఠశాలలో, ఐదు నుండి 10వ తరగతి వరకు సిర్పూర్(టి) రెసిడెన్సీలో, ఇంటర్ హైదరాబాద్ కళాశాలలో పూర్తిచేసుకొని జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో సీటు సాధించాడు. తేజను మండలవాసులు అభినందించారు.

ఓబీసీ జాబితాలో చేర్చాలని వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆరె కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఆరె సంఘం నాయకులు గురువారం న్యూ ఢిల్లీలో కేంద్ర నాయకులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆధ్వర్యంలో ఆరె సంఘం నాయకులు ఎన్‌సీబీసీ ఛైర్మన్ హన్సరాజ్ గంగారాం అహిర్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు, సెంట్రల్ పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. వీరు సానుకూలంగా స్పందించినట్లు ఆరె సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ తెలిపారు. వీరి వెంట సంఘం నాయకులు దోకె దామోదర్, ఎల్కరి దామోదర్ ఉన్నారు.

ఎస్ఐకి సన్మానం



నవతెలంగాణ - కౌటాల

ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన మధుకర్‌ను ఎంపీపీ విశ్వనాథ్, బీఆర్ఎస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాస్, గుండాయిపేట్ ఉప సర్పంచ్ లహంచు పటేల్, నాయకులు భిట్టుపెల్లి సంతోష్, డబ్బ బాపు, రాంచందర్, సంతోష్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనుల ప్రారంభానికి రావాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మంచిర్యాల జిల్లా తాండూరు నుండి కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లా మీదుగా మంజూరైన నూతన జాతీయ రహదారి పనుల ప్రారంభానికి కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ హాజరు కావాలని కోరినట్లు బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. రూ. 11 వేల కోట్ల అంచనాతో తాండూరు, భీమిని, దహెగాం, కాగజ్‌నగర్, సిర్పూరు, కౌటాల మండలాల మీదుగా మహారాష్ట్రలోని గడ్చిరోలి వరకు నూతన జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ రహదారి పనులను త్వరలోనే కౌటాల మండలకేంద్రంలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దీనికి మంత్రిని హాజరు కావాలని కోరినట్లు హరీష్‌బాబు తెలిపారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు ఆధ్వర్యంలో మంత్రిని కలిసినట్లు తెకలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్కరి దామోదర్, చప్పిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్టీపీపీ రైల్వే ట్రాక్ అసంపూర్తి పనులతో అవస్థలు



నవతెలంగాణ-జైపూర్

అసంపూర్తిగా నిర్మించిన ఎస్టీపీపీ రైల్వే ట్రాక్ పనులతో ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోందని ఇందారం గ్రామ పంచాయతి ఖాసీంపల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ అవసరాల నిమిత్తం నిర్మించిన రైల్వే ట్రాక్ సంబంధించిన సైడ్ డ్రైన్ పనులు మధ్యంతరంగా వదిలేయడం సమస్యగా మారిందని పేర్కొంటున్నారు. భారీగా కురుస్తున్న వర్షాలతో రైల్వే ట్రాక్ సైడ్ డ్రైన్ మీదుగా వరద నీరు ఖాసీంపల్లిలో వచ్చి చేరిందని పేర్కొంటున్నారు. ఇండ్లలోకి వచ్చిన వరదతో గృహోపకరణాలు, ఆహార ధాన్యం తడిపోయిందని పేర్కొంటూ సింగరేణి అధికారులు ఇబ్బందుల పట్ల వెంటనే స్పందించాలని డీసీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి రేగుంట రాకేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎండీ ఫయాజోద్దీన్ డిమాండ్ చేశారు.

నీటమునిగిన కాలనీల్లో పర్యటించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నీటమునిగిన కాలనీల్లో గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సాజిద్ ఖాన్ పర్యటించారు. రాంనగర్ కాలనీలో పర్యటించి ఇంటింటికీ తిరుగుతూ వారి కష్టాలను తెలుసుకున్నారు. వర్షాలతో తమ ఇల్లు కూలిపోయి ఇబ్బందులు పడుతున్నామని, వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, పట్టణ అధ్యక్షులు నగేష్, మాజీ కౌన్సిలర్ ముర్తుజా, సేవాదళ్ అధ్యక్షులు మోతీరాం, టౌన్ వైస్ ప్రెసిడెంట్ సమీర్, వార్డు నాయకులు ఇమ్రాన్, గౌస్ భాయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాహెర్ ఖాన్, కలీం, రజాక్, హన్ను, రసూల్, హలీం అఫ్సర్, సీనియర్ నాయకులు అక్తర్, హనీఫ్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

అరుణ్‌ను సన్మానించిన టీఎన్జీఓ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎక్సైజ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆదిలాబాద్ జిల్లా ఉద్యోగి కొమ్రేవార్ అరుణ్ కుమార్ ఎక్సైజ్ శాఖ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను టీఎన్జీవోస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, ఏ.నవీన్ కుమార్‌లు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

ఎస్సైగా విజయ్‌కుమార్ బాధ్యతలు

నవతెలంగాణ-కెరమెరి



చింతలమానేపల్లిలో విధులు నిర్వర్తించి బదిలీపై వచ్చిన ఎస్సై జి.విజయ్‌కుమార్ గురువారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. శాంతి భద్రతల సంరక్షణ కోసం ఎల్లవేళలా మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. అందుకు మండల ప్రజలు సహకరించాలని కోరారు. బాధ్యతలు తీసుకున్న ఎస్ఐని మాలి సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం మండల అధ్యక్షుడు కావుడే తులసిరాం, నారాయణ, తిరుపతి, సుధాకర్, అశోక్ పాల్గొన్నారు.

కుమురం భీం విగ్రహం ఏర్పాటుపై ఆందోళన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ కంపెనీ ముందు స్థలంలో కుమురంభీం విగ్రహం ఏర్పాటుపై ఆదివాసీ సంఘాల నాయకుల ఆందోళనతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఎన్నో రోజులుగా కంపెనీ యాజమాన్యాన్ని కోరుతున్నా పట్టించుకోకపోవడంతో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటుకు పూనుకోవడం జరిగిందని ఆదివాసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. దీంతో ఓరియంట్ కంపెనీ, పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆదివాసీ సంఘాల నాయకులు ఆందోళనకు దిగి నినాదాలు చేశారు. ఎట్టి పరిస్థితిలో విగ్రహ పనులు చేపడుతామని తేల్చి చెప్పడంతో ఉద్రిక్తత వాతావణం నెలకొంది. ఉద్రిక్తత నడుమ ఆదివాసీ సంఘాల నాయకులు కుంరంభీం విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు, రాష్ట్ర సభ్యులు సోయం జంగు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, జిల్లా ఉపాధ్యాక్షుడు మడావి అనంతరావు, మండల అధ్యక్షుడు ఆత్రం జంగు, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వెడ్మ కిషన్, ప్రధాన కార్యదర్శి మడావి వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్యామలదేవి గురువారం ఎమ్మెల్యే జోగు రామన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందించి, అనంతరం పలు అంశాలపై చర్చించారు. జిల్లలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గడ్డెన్న వాగు ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

- సిరాల ప్రాజెక్టుకు గండి.. వేలాది ఎకరాల్లో పంటనష్టం



నవతెలంగాణ-భైంసా

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరింది. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు అప్రమత్తమై ఏడు గేట్లను ఎత్తివేసి, లక్షా పద్దెనిమిది వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదిలారు. దీని ప్రభావంతో లోతట్టు ప్రాంతాలన్ని జలమయం అయ్యాయి. భైంసాలోని కమల టాకీస్ ఏరియా, రాహుల్ నగర్, గణేష్‌నగర్ తదితర కాలనీలు నీటమునిగాయి. పరివాహక గ్రామాలైన కామోల్, వాలెగాం, గ్రామాల్లోకి నీరు రావడంతో పాటు వందల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.

జలదిగ్బంధనంలో గ్రామాలు...

వర్షాలతో వాగులు, వంకలు, ఉప్పొంగడంతో భైంసా మండలంలోని గ్రామాలు జలదిగ్బంధనం అయ్యాయి. పల్సికర్ రంగారావు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ మూలంగా గుండెగాం గ్రామం నీట మునిగింది. మహాగాం, వాడి గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

సిరాల ప్రాజెక్టుకు గండి..

భైంసా మండలంలోని సిరాల ప్రాజెక్టుకు గండి పడటంతో వందలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. సిరాల గ్రామం నీట మునగడంతో ప్రజలు గుట్టపై తల దాచుకున్నారు. ఇలేగాం కొత్త చెరువు తెగిపోయింది. దీంతో పంటల్లో నీటి ప్రవాహంతో అపార నష్టం వాటిల్లింది.

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ పర్యటన



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలో గత కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరదకు గురైన ప్రాంతాలను, విడివిడిగా ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్, ఎస్పీ కే.సురేష్ కుమార్, డీఎస్పీ కరుణాకర్ గురువారం మండలంలోని పలు ముంపు ప్రాంతాలను పరిశీలించారు. మండలంలోని గూడెం అంతరాష్ట్ర వంతెన, ప్రాణహితనదితో పాటు దిందా, బాబాసాగర్ వాగుల వరద ఉధృతిని పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని నియమించాలని సూచించారు. వరద ఉధతంగా ఉన్న ప్రాంతంలో వాగులు దాటవద్దని తెలిపారు. వాగుల వద్ద ఉన్న ప్రజలతో ఎస్పీ మాట్లాడుతూ వారి పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు. వారి తోపాటు తహసీల్దార్ మన్సూర్ అలీ, కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్సై వెంకటేష్ ఉన్నారు.

వరద ప్రమాదం ఉండదు

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-కడెం

ప్రజలు భయాందోళన చెందవద్దని కడెం ప్రాజెక్టు వరద ప్రమాదం ఉండదని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీర రేఖ నాయక్, నిర్మల్ జిల్లా కలెక్టర్ కే.వరుణ్‌రెడ్డి, నిర్మల్ జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్‌తో కలిసి కడెం ప్రాజెక్టులను సందర్శించారు. ఈ సందర్భంగా కడెం ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం కడెం జలాశయంలో వస్తున్న ఇన్‌ఫ్లో వరద నీరు వరద గేట్ల పరిస్థితిపై నీటిపారుదల శాఖ అధికారులకు అడిగి తెలుసుకున్నారు. కడెం ప్రాజెక్టు వరదగేట్లపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు లోతట్టు గ్రామాల ప్రజల తరలింపు ప్రాజెక్టుకు వరద ముప్పు ఏర్పడితే తీసుకోవాల్సిన చర్యలపై పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కడెం ప్రాజెక్ట్‌పై మంత్రి మాట్లాడుతూ ప్రాజెక్టుకు చెందిన నాలుగు వరద గేట్లు మోరాయించిన సందర్భంగా ప్రస్తుతం ప్రాజెక్టు చెందిన 14 వరద గేట్ల ద్వారా రెండు లక్షల 40 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారని అన్నారు. కడెం జలాశయంలో ప్రస్తుత ఇన్‌ఫ్లో నీరు తగ్గుముఖం పడుతుందని, ప్రాజెక్టుకు ఎలాంటి వరద ప్రమాదం ఉండబోదని తెలిపారు. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో వరద నీరు అధికంగా వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు అధికారులకు మంత్రి సూచించారు. అనంతరం ఎమ్మెల్యే రేఖ శ్యామ్ నాయక్ మాట్లాడుతూ ప్రాజెక్టులోనికి భారీగా వరద ప్రవాహం వస్తుందని, తెలిసి కూడా అధికారులు బుధవారం రాత్రి నాలుగు గేట్లు ఎత్తకుండా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. అధికారుల పనితీరు పైఅధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని అన్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే తప్ప ప్రజలు బయటకు రావద్దని అన్నారు. ప్రాజెక్టును పరిశీలించిన వారిలో వెంట కడెం ప్రాజెక్టు ఈఈ రాథోడ్ విఠల్, డీఈ బోజదాసు, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, కడెం మండల తహసీల్దార్ చిన్నయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఖానాపూర్ సీఐ రవీందర్ నాయక్, ఎస్సై కే.రాజు స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను ఉధృతం చేస్తాం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్

నవతెలంగాణ-హాజీపూర్

సఫాయి కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టావా అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ ప్రశ్నించారు. తెలంగాణ గ్రామ పంచాయతీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుతో మంచిర్యాల ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌ను గురువారం ముట్టడించారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతిలాల్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులు తమ సమస్యలు పరిష్కారం చేయాలి అని గత 22 రోజులుగా సమ్మె చేస్తుంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. సమ్మె చేస్తున్న కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్షతను విడనాడాలన్నారు. సమ్మెలో ఉన్న కార్మికుల పట్ల అధికారుల బెదిరింపులు ఆపాలన్నారు. కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తూ ప్రమాదకరంగా తెచ్చినటువంటి జీవో నెంబర్ 51 సవరించి, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో విధుల్లో చనిపోయినటువంటి కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. తక్షణమే కుటుంబానికి రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో కార్మికుల పట్ల ప్రజా ప్రతినిధుల వేధింపు



అరికట్టాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెపై ముఖ్యమంత్రి స్పందించి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాసరి సురేష్, చిన్నన్న, సుధాకర్, జేఏసీ నాయకులు శ్రీనివాస్, సుజిత్ కుమార్, భీమయ్య, దినేష్, లింగన్న, కృష్ణమూర్తి గౌడ్, లక్ష్మి, సునీత లు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- నివేదికలను చదివి వినిపించిన అధికారులు
- విద్యుత్తు అధికారులను నిలదీసిన అనార్‌పల్లి సర్పంచ్



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పెందూర్ మోతీరాం అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ముందుగా వ్యవసాయ శాఖ అధికారి గోపికాంత్ తమ నివేదికను చదివి వినిపించారు. అర్హులైన రైతులకు రైతు బంధు అందజేస్తున్నామని తెలిపారు. మృతి చెందిన రైతు కుటుంబాలకు రైతు భీమా పథకం వర్తింపజేస్తున్నామన్నారు. ఇన్‌ఛార్జి విద్యుత్ ఏఈ రమేష్ మాట్లాడుతుండగా అనార్ పల్లి సర్పంచ్ రాథోడ్ శేషారావ్ కలుగజేసుకొని గతేడాది విద్యుత్ షాక్‌తో కందారే మారుతి మృతి చెందాడని తెలిపారు. రూ.5 లక్షల నష్టపరిహారం కోసం క్లేయిమ్ చేసిన విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం మూలంగా బాధిత కుటుంబానికి నేటికి నష్టపరిహారం అందలేదని ఆరోపించారు. ఫారెస్టు రేంజి కార్యాలయం పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా నేటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని అటవీ శాఖ అధికారి సభ దృష్టి కి తీసుకెళ్లారు. ఏపీఓ మల్లయ్య మాట్లాడుతూ రైతులు వరి సాగు చేయాలని సూచించారు. పశువైద్య శాఖ అసిస్టెంట్ డాక్టర్ సోనియా మాట్లాడుతూ పశువులకు గాలి కుంటు తదితర వ్యాధులకు సంభదించిన టీకాలు అందజేశామన్నారు. వైద్యాధికారి వినోద్ మాట్లాడుతూ కండ్ల నలత వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి సోకిన వారిని మూడు రోజుల పాటు ఐసోలేషన్‌లో ఉంచి, ఇతరులకు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సెడ్మకి ద్రుపత బాయి, ఎంపీడీఓ మహేందర్, ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

అటవీ సహజ సంపదను కొల్లగొట్టేందుకే..

నవతెలంగాణ-నిర్మల్

మణిపూర్ ఈశాన్య రాష్ట్రాల్లోని అటవీ సహజ సంపదను కొల్లగొట్టి, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే జాతుల మధ్య వైశమ్యాలను నాయకులు సృష్టిస్తున్నారని సీపీఐ(ఎంఎల్)న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో మణిపూర్‌లో జరుగుతున్న మరణకాండను నిరసిస్తూ, నల్ల జెండాలతో నిరసన తెలియజేశారు. ఇప్పటి పాలకులు అధికారం, వనరుల కోసం ప్రజల మధ్య, జాతుల మధ్య ఘర్షణలు సృష్టిస్తూ మారణహోమానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ఉద్యేశపూర్వకంగానే ఇంటర్నెట్ సౌకర్యాన్ని నిలిపివేశారని అన్నారు. మణిపూర్‌ను బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా చేసి హత్యల పరంపరలు కొనసాగించారని అన్నారు. ఒరిస్సాలో కూడా ఖనిజవనరులను కబ్జా చేసినందుకు ప్రయత్నించగా అక్కడి ఆదివాసీల తిరగబడ్డారని గుర్తు చేశారు. అంతర ఘర్షణలను సాకుగా చూపుతూ ఆదివాసీ అనుకూల చట్టాలను రద్దు చేసేందుకు పాలకులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. మణిపూర్ ఊచకోతలపై జ్యూడిషియల్ విచారణ జరపాలని కోరారు. దేశ సంస్కృతీ, సాంప్రదాయాలు, దేశభక్తి గురించి మాట్లాడే మోడీ పాలనలో సమాజం తలదించుకునే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని



వీటికి బాధ్యత వహిస్తూ సిగ్గుతో పాలకులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకట నారాయణ, హరిత, సర్దార్, గోపి నర్సయ్య, సునారికరి రాజేష్, వెంకటేష్, కేశవ్, వినోద్, కళావతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-బోథ్

బోథ్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని గురువారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు దిష్టిబొమ్మను రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు పసుల చంటి మాట్లాడుతూ ఉద్యమం నడుస్తున్న తరుణంలో నిరాహార దీక్షలు ఆందోళన చేస్తూనప్పటికీ ప్రధాన అంశమైన డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉందని అన్నారు. అలాగే బోథ్ ఎమ్మెల్యే కావాలని ఇచ్చోడకు డిగ్రీ కళాశాలను మంజూరు చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. బోథ్‌లో స్థలం లేక పోవడంతోనే ఇచ్చోడకు మంజూరు చేయడం, ఇచ్చోడ ఏజెన్సీ ప్రాంతంలో స్థలం ఎక్కడిదని ప్రశ్నించారు. అలాగే దీనికి నిరసనగా బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు దిష్టి బొమ్మ దహనం చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాడుతూనే ఉంటామని అన్నారు. జైలుకైన పోవడానికి సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

తుంపల్లి వాగుపై వంతెన నిర్మించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్ రూరల్

మండలంలోని తుంపల్లి వాగుకు శాశ్వత ప్రాతిపాధికన వంతెన నిర్మించాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. గతంలో వంతెన చివర కొట్టుకపోయిన ప్రాంతంలో గురువారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించారు. ఈ సందర్భంగా వాగును పరిశీలించడానికి వచ్చిన అధికారులతో పరిస్థితి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుంపల్లి వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని అంతవరకూ శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయాలన్నారు. ఎంపీపీ స్పందించి తాత్కాలిక రోడ్డు వేసినందుకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, సింగిల్ విండో చైర్మన్ అలీబీన్ అహ్మద్ పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రామపంచాయతీ కార్మికులు సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీ ద్వారా ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. సఫాయి కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని, న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ పంచాయతీ కార్మికులు సమ్మెలో భాగంగా ర్యాలీగా తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కారోబర్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. జీవో నెంబర్ 51 సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. వయసు పైబడిందన్న సాకుతో కార్మికులను మార్చితే ఆ కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బొజ్జ ఆశన్న, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సంఘం ముఖ్య సలహాదారుగా కోట వెంకన్న



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలి సేవా సంఘం జిల్లా జిల్లా ముఖ్య సలహాదారుగా కోట వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర పద్మశాలి సంఘం(98/2023) అనుబంధంగా అమలులో ఉంటుందని జిల్లా అధ్యక్షుడు చెన్నూరి అశోక్, ప్రధాన కార్యదర్శి మోర సంపత్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పద్మశాలీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అలుగొట్టు తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షులు జంజిరాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్ కుమార్, ఉపాధ్యక్షుడు వంగరి రవి కుమార్, ఎనగందుల శ్రీనివాస్, దాసరి రాజు, అన్నం అంజయ్య పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఏరియా కాసిపేట గనిపై విధులు నిర్వర్తిస్తూ కోవిడ్‌తో మృతి చెందిన కార్మికుడు పిల్లి భూషణం కుటుబానికి సింగరేణి తరపున మంజూరైన కోవిడ్ ఎక్స్‌గ్రేషియా చెక్కును అందించారు. గురువారం కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిల్లి భూషణం భార్య పిల్లి పద్మకు రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును కాసిపేట గ్రూప్ ఏజెంట్ రాందాస్, మేనేజర్ అల్లావుద్దీన్ అందించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారి మీర్జాగౌస్, ఇంజనీర్ బాబు, మధుకర్, బన్న లక్ష్మణ్, టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి వొడ్నాల రాజన్న, పిట్ సెక్రెటరీ బైరి శంకర్, ఏఐటీయూసీ సహాయ పిట్ కార్యదర్శి వర్ధమల్ల రాజేందర్, రాగుల సతీష్ పాల్గొన్నారు.

బీసీ సంఘ భవనం, స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో బీసీ సంఘ భవనం, బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్నర్ రమేష్ అన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో జడ్పీ చైర్పర్సన్ కోవలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘానికి భవనం లేకపోవడంతో సమావేశాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. జిల్లాలో అనేకమంది పేదలు నిరుద్యోగులుగా ఉన్నారని వారి సౌకర్యార్థం స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలన్నారు. చైర్ పర్సన్ సానుకూలంగా స్పందించి త్వరలోనే భవనం మంజూరు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, రైతు అధ్యక్షుడు మారుతి, గడ్డల శంకర్, బల్దారువు మధుకర్, మిట్ట తిరుపతి, సిరికొండ సాయికృష్ణ, రాపర్తి నాగేష్, పూదరి నారాయణ, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మునిగిన పంట పొలాలు

నవతెలంగాణ-కోటపల్లి



చెన్నూరు మండలంలోని సుందరశాల నర్సక్కపేట, గ్రామాల సమీపంలోని అన్నారం బ్యారేజ్ కి వరద నీరు పోటెత్తింది. దీంతో బ్యాక్ వాటర్ గ్రామ సమీపంలోకి వస్తుంది. పొక్కురు, సుందరశాల గ్రామాల సమీపంలోని పంట పొలాలను వరద నీరు ముంచెత్తింది. గోదావరి వరద ఉధృతి ఇలాగే కొనసాగితే గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. పోయిన సంవత్సరం ఇలాగే వరదలు వచ్చి పంట నష్టం జరిగినా ఏ ఒక్క అధికారి పట్టించుకున్న పాపం పోలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఇలా జరుగుతుందని గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించక ముందు తమ పంట పొలాలకు ఎలాంటి నష్టం జరిగేది కాదని కాళేశ్వరం నిర్మించిన తర్వాత ప్రతి ఏడు పంట నష్టం తీవ్రస్థాయికి చేరిందని ఏ పంట వేసిన నీటి పాలు అవుతుందని ఆవేదన చెందుతున్నారు. అలాగే చెన్నూరు మండలంలోని బుద్ధారం, సంకారం, సుద్దాల, కత్తెరసాల, గ్రామాల సమీపంలోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

అదనపు కలెక్టర్, ఆర్డీఓను కలిసిన టీఎన్జీఓ నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే. శ్యామలదేవి, ఆర్డీఓ స్రవంతిలను ఆదిలాబాద్ టీఎన్జీవోస్ సభ్యులు కలెక్టరేట్‌లోని వారి కార్యాలయంలో గురువారం వేరువ్వేగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపినట్టు టీఎన్జివోస్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తిరుమల్‌రెడ్డి, చంద్రమోహన్, రాజేశ్వర్, నారాయణ, సుజాత, సుమిత్ర, అన్నపూర్ణ, సుజాత, చంద్రశేఖర్, తాలూకా యూనిట్ కార్యదర్శి కొమ్రేవార్ అరుణ్, రూరల్ యూనిట్ అధ్యక్షులు అసూరి ప్రవీణ్, కార్యదర్శి దత్తు, వివిధ శాఖల ఉద్యోగులు కలీం, సాయి, నయీం పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

భారి వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాలని, ఎటువంటి ఇబ్బంది ఉన్నా పురపాలక అధికారులను సంప్రదించాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ సూచించారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. స్థానిక భగత్ సింగ్‌నగర్, సుభాష్‌నగర్, పీహెచ్‌సీ కాలనీ, కుమ్మరికుంట తదితర కాలనీలలో చైర్మెన్ పర్యటించి, స్థానికులతో కలిసి మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఎప్పటికపుడు సత్వర చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. కుంభ వృష్టి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సైతం అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను మున్సిపల్ యంత్రాంగం దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారి వెంకటేశ్వర్లు, కౌన్సలర్ డాక్టర్ లక్ష్మణ్, ఆవుల వెంకన్న పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజారోగ్యమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. రెబ్బెన మండలంలోని ఆదర్శ కాలనీకి చెందిన మూర్తికి అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 2.5 లక్షల ఎల్‌ఓసి చెక్ హైదరాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి మూర్తి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ 38 గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-హాజీపూర్

వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు, ఎగువన ఉన్న కడెం, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్‌ల గేట్లు ఎత్తివేతతో ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్ట్ లోకి 6లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 20 టీఎంసీలకు గాను 16 టీఎంసీల నీరు ప్రాజెక్ట్‌లో వుంది. ఇన్ఫో ఎక్కువగా ఉండడంతో అధికారులు గురువారం సాయంత్రం 6గంటల వరకు 38 గేట్లు ఎత్తి 6 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు.

ఆదిలాబాద్‌లో న్యాక్ బృందం పర్యటన

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలను గురువారం జాతీయ అంచనాలు ప్రమాణాల సంస్థ(న్యాక్) బృందం సందర్శించింది. ఈ బృందం కళాశాల అందిస్తున్న కోర్సులు, బోధనా సౌకర్యాలు, మౌలిక వసతులు, పరిశోధన, విద్యార్థుల విజయాలు, గ్రంథాలయం, ప్రయోగశాలలు, క్రీడా సౌకర్యాలు, పరీక్షా ఫలితాలు తదితర అంశాలను పరిశీలించి, కళాశాలకు గ్రేడును సిఫారసు చేయనుంది. గురు, శుక్ర రెండు రోజుల పాటు పరిశీలించనున్నారు. ముందుగా వారికి కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సమన్వయకర్త షేక్ ముజీబ్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వరదల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్**



నవతెలంగాణ-హాజీపూర్

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు ఉధృతంగా వస్తుండటంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లాలో గోదావరి, ఇతర వాగులలో వరదనీటి ప్రవాహం అధికమవుతున్నందున గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్‌నగర్ ప్రాంతంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, డీసీపీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ట్రైనీ కలెక్టర్ పి. గౌతమి, తహసీల్దార్ పిన్న రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం హాజీపూర్ మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులో చేరుతున్న వరదనీటిని ఎమ్మెల్యే దివాకర్‌రావు, ప్రాజెక్టు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు, వాగులలో వరదనీరు పెద్ద ఎత్తున చేరుతుందని, వరద పరిస్థితులలో ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు అధికార యంత్రాంగం అందుబాటులో ఉంటుందని తెలిపారు. వరద పరిస్థితుల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లాలోని ప్రాజెక్టులలోకి చేరుతున్న వరదనీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రాజెక్టు సామర్థ్యానికి అనుగుణంగా తీసుకోవలసిన చర్యలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. రాబోవు 2రోజులు వర్ష సూచన ఉన్నందున అత్యవసర స్థితి నెలకొనే అవకాశం ఉందని, అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజల రక్షణ కొరకు జిల్లాలో 12 పునరావాస కేంద్రాలతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అత్యవసర సేవలు అందించడం జరుగుతుందని, ప్రజల సహాయార్థం సమీకత కలెక్టరేట్ భవనంలో కంట్రోల్ రూమ్ నం. 08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

విద్యుత్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లాలో ఎక్కడైన విద్యుత్ స్తంభాలు కిందకి ఒరిగినా, విరిగిపోయినా, పడిపోయినా, విద్యుత్ తీగలు వేలాడుతున్నా వెంటనే సమాచారం అందించడం కోసం కంట్రోల్ రూమ్ నెం.7901628369 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తక్షణ చర్యలు చేపడతారని తెలిపారు.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

చెన్నూర్ మండలం పొక్కూర్ గ్రామంలో బ్యాక్ వాటర్ వస్తున్నందున కలెక్టర్, డిసిపి, చెన్నూర్ మండల తహసీల్దార్ దేశ్ పాండేతో కలిసి పరిస్థితిని పర్యవేక్షించి లోతట్టు ప్రాంతాల గ్రామస్తులను యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనంతరం బతుకమ్మ వాగును పరిశీలించి ప్రజల రక్షణ కొరకు తీసుకోవలసిన చర్యలపై అధికారులకు తగు సూచనలు సలహాలు చేశారు.

ప్రత్యేక అధికారి నియామకం

జిల్లాలో నెలకొన్న వరద పరిస్థితులను పర్యవేక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాల మేరకు జిల్లాకు ప్రత్యేక అధికారిగా రాష్ట్ర శిశు సంక్షేమశాఖ కమిషనర్ భారతి హోళికేరిని నియమించింది. గతంలో జిల్లాలో నెలకొన్న వరద పరిస్థితులపై అనుభవం దృష్ట్యా ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టేందుకు అధికారిని నియమించారు.

పునరావాస కేంద్రాలు

జిల్లాలోని జన్నారం మండలం రోటిగూడ గ్రామంలో గీతామందిర్ ఫంక్షన్ హాల్, బాదంపల్లి గ్రామంలోని పోచమ్మవాడలో బాదంపల్లి ఫంక్షన్, పొనకల్ గ్రామంలో బుడగజంగాల, సుందరయ్య కాలనీలో పిఆర్‌టియు భవన్, తపాల్పూర్ గ్రామంలో ఎస్‌సి కాలనీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిమ్మాపూర్ గ్రామంలో టిడబ్ల్యుఎస్ నాయకపువాడ, రాంపూర్ గ్రామంలో ఎస్‌టి తండా, గొల్లవాడలో మాలసంఘం భవనం, ధర్మారం గ్రామంలో గోండుగూడలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల,

మంచిర్యాల పట్టణంలోని ఎన్.టి.ఆర్. నగర్ భవన నిర్మాణ కార్మిక సంఘ భవనం, దండేపల్లి మండలంలోని గుడిరేవు గ్రామంలో ఎస్.సి. కాలనీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ద్వారక గ్రామంలో మజీద్వాడలో ప్రాథమికోన్నత పాఠశాల, చెన్నూర్ పట్టణంలోని సాయిరాం ఫంక్షన్‌హాల్, హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 970 మందికి పునరావాసం కల్పించామని అధికారులు పేర్కొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- **జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు**

నవతెలంగాణ-ఆసిఫాబాద్ రూరల్

రైతుల అవసరానికి సరిపడా ఎరువులు పంపిణీ చేసి వారి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేసే ఎరువులను మండలంలోని రహపెల్లి గ్రామంలో రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు ఇబ్బంది పడకుండా చూడడమే లక్ష్యమన్నారు. ఎరువులను సరైన సమయంలో తీసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుంకరమంగా పెంటయ్య



సర్పంచులు బూసి భీమేష్, శ్రీనివాస్, నాయకులు నిస్సార్ అహ్మద్, అహమద్, రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వాగు దాటుతూ రైతు మృతి

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని శివపల్లి గ్రామానికి చెందిన రైతు చిన్ను(62) వాగు దాటుతూ గల్లంతై మృతి చెందాడు. వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగొచ్చే క్రమంలో వాగు దాటుతూ నీటిలో చిక్కుకొని మృతి చెందాడు. రైతు మృతి చెందిన విషయాన్ని మండల అధికారులు ఉన్నతాధికారులకు తెలియకుండా గోప్యంగా ఉంచినట్టు మండల ప్రజలు పేర్కొంటున్నారు. బుధవారం రైతు గల్లంతుకాగా గురువారం మృతదేహం లభ్యమైంది. కలెక్టర్, ఎస్పీ నీటి ఉధృతిని పరిశీలించేందుకు వచ్చినా మండల అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయకపోవడం గమనార్హం. ఎస్సై వెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకొని రైతు మృతిపై ఆరా తీసినట్టు సమాచారం.

స్వర్ణ ప్రాజెక్ట్‌ను సందర్శించిన మంత్రి



నవతెలంగాణ-సారంగాపూర్

భారీ వర్షాలకు మండలంలోని స్వర్ణ, వైకుంఠపూర్ ప్రాజెక్టులతో పాటు అయా గ్రామాల్లోని చెరువులకు వరద నీరు పోటెత్తి నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గురువారం స్వర్ణ ప్రాజెక్ట్‌ను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సందర్శించారు. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో అండ్ అవుట్‌ఫ్లోపై నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్ఆర్ఎస్పీతో పాటు జిల్లాలోని కడెం, గడ్డెన్న, స్వర్ణ ప్రాజెక్ట్‌లోకి భారీ వరదలు వస్తుండటం వల్ల ముందే గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రాజెక్ట్‌ల పరివాహక ప్రాంత పరిధిలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో వరదల సందర్భంగా ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని పేర్కొన్నారు. వారి వెంటా మండల ఇన్‌చార్జీ పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, అడెల్లి చైర్మెన్ అయిటి చందు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవ్ రావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వైద్య సేవలందించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలని జిల్లా విద్యాధికారి రామక్రిష్ణ సూచించారు. గురువారం కాగజ్‌నగర్ సీహెచ్‌సీతోపాటు భట్టుపల్లి, ఈజ్‌గాం పీహెచ్‌సీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలో ఓపీ, ప్రసవాలను పెంచాలని సూచించారు. వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ధరంసింగ్, జిల్లా ఆరోగ్య బోధకులు రశీద్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.